Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 19.10.2018, శుక్రవారం   సంపుటి : 38  సంచిక : 20   పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి   సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

# అతీగతీ లేని అ(భ్ర)మరావతి!

- నాలుగున్నరేళ్ళుగా గాలిలో మేడలే!
- వేలకోట్లు ఖర్చు... డిజైన్‌లు దాటని రాజధాని
- బాబు గ్రాఫిక్ మాయాజాలంలో రాష్ట్రం



***ఇంకో ఆరేడు నెలల్లో రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరుగనున్నాయి. మహా అంటే ఇప్పుడున్న ప్రభుత్వం ఇంకో మూడు నెలలు పాలన చేస్తుంది. తర్వాతంతా ఎన్నికల మూడ్‌లోకి వెళ్ళిపోతుంది. ఎన్నికల తర్వాత గెలిచేదెవరో... ఓడేదెవరో... మళ్ళీ తెలుగుదేశమే అధికారంలోకి వచ్చిందనుకుందాం... అమరావతి అనే రాజధాని సీరియల్ కొనసాగుతుంది. ఇంకో ఐదేళ్ళవరకు కూడా అమరావతి నగరాన్ని ఏ నగరం తరహాలో నిర్మించాలో ఆలోచించడానికి తీరిక దొరుకుతుంది. అలాకాకుండా వైసిపి అధికారంలోకి వస్తే... అమరావతి రాజధానిని సీరియల్‌గా కాదు సినిమాగా ముగించే అవకాశముంటుంది.***

ఈ నాలుగున్నరేళ్ళ చంద్రబాబు పాలనలో అతిపెద్ద అట్టర్‌ఫ్లాప్ షో అమరావతి. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక శ్రీకృష్ణ కమిటీ సూచించిన దొనకొండ ప్రాంతాన్ని కాదని కుల సంకుచిత ధోరణితో, వాస్తు పిచ్చితో అమరావతి ప్రాంతాన్ని రాజధానికి ఎంపిక చేసుకున్నాడు చంద్రబాబు. దేశంలోనే అత్యంత సారవంతమైన భూములున్న ప్రాంతమిది. ఎక్కువ రకాల పంటలు పండే భూములివి. ఆంధ్రప్రదేశ్‌కు ధాన్యాగారంగా పేరు తెచ్చి పెట్టిన గ్రామాలివి. అలాంటి బంగారు పంటలు పండే 33వేల ఎకరాల భూములను రాజధాని పేరుతో స్వాధీనం చేసుకున్నారు. పచ్చటి పైర్లను నాశనం చేసి బీడు పెట్టారు. వేలాదిమంది రైతులు, రైతు కూలీలకు పనులు లేకుండా చేశారు. అట్లాగని రైతులకు నష్టపరిహారమన్నా ఇచ్చారా అంటే అదీ లేదు. భూ సమీకరణ క్రింద ప్లాట్లు ఇస్తామన్నారు. అవి కూడా (మిగతా 11వ పేజీలో)

# ఒక్క దాడికే.. దడపుట్టిందా?



- అధికారిక దాడులకు రాజకీయ ముసుగు
- లొసుగులు ఎక్కడ బయటపడతాయోనని ఆందోళన
- ప్రత్యర్థులపై జరిగితే సక్రమం... తమ వారిపై జరిగితే అక్రమమా?



సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్... ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్... ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్... ఏపి పోలీసుల సంయుక్త దాడులు... కేంద్ర ప్రభుత్వ ప్రతీకారచర్య... కోర్టుల్లో కులపక్షపాత నాయ్యమూర్తులు... ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి... కేంద్రమంత్రులు... రాష్ట్ర మంత్రులు... ప్రధాన ప్రతిపక్షంగా వున్న పార్టీ సైతం ప్రభుత్వ చర్యలకు మద్దతు... కుల మీడియా పూర్తి వ్యతిరేక కథనాలు...

వీటన్నింటిని, వీరందరినీ ఒకే ఒక్కడు ఎదుర్కొన్నాడు. అది కూడా నలభై ఏళ్ళ వయసులో... తనపై కక్షగట్టిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను, కేంద్ర, రాష్ట్ర యంత్రాంగాలను, జాతీయ, ప్రాంతీయ మీడియా సంస్థల విషప్రచారాన్ని ఎదుర్కొని నిలబడ్డాడు. కక్షగట్టి జైలుకు పంపిస్తే మొండి ధైర్యంతో నిలబడ్డాడు. పంతం పట్టి బెయిల్ కూడా రాకుండా చేస్తే, 16నెలల తర్వాతే జైలు నుండి వచ్చాడు. ఓ పక్క కేసులు... మరోపక్క ఆస్తుల జప్తులు... ఇంకో పక్క కులమీడియా విద్వేషకథనాలు. అయినా తొణకలేదు, బెణకలేదు... ఆయనలోని ఆత్మవిశ్వాసం చెక్కుచెదరలేదు. అది వై.యస్.రాజశేఖరరెడ్డి రక్తం. అది రాజన్న ఇచ్చిన గుండె ధైర్యం. కాబట్టే తనపై ఇంత జరిగినా వెన్నుచూపక, రాజీపడక రాజకీయాలను వదలక రాజమార్గంలో నడుస్తున్న నాయకుడిగా వై.యస్.జగన్మోహన్‌రెడ్డి (మిగతా 11వ పేజీలో)






# మితిమీరుతున్న ధోరణి... మాట తూలుతున్న కాకాణి

## ఇదేం సంస్కారం...?

12లో

# సేద్యంలోనూ స్త్రీశక్తిని చాటారు

## అధిక దిగుబడులు సాధించిన పదిమందికి అవార్డులు

జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15న నెల్లూరులోని కొత్త జడ్పీ హాల్‌లో మహిళా కిసాన్ దివస్-2018 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయరంగం, దాని అనుబంధ రంగాల్లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించిన పదిమంది మహిళా రైతులను ఉత్తమ మహిళారైతులుగా గుర్తించి వారిని ఘనంగా సన్మానించి అవార్డులను బహుకరించారు.

అవార్డులు అందుకున్న మహిళా రైతుల్లో వ్యవసాయరంగంలో మేకల వెంకటరాజేశ్వరి (బ్రహ్మదేవం-ముత్తుకూరు మండలం), చాగం రాజేశ్వరమ్మ(అల్లూర్తి-పొదలకూరు మండలం), ముత్యంశెట్టి ఆది నారాయణమ్మ(బాలాయపల్లి), కుమ్మరి తిరుపతమ్మ (ఉప్పులూరు-కొండాపురం మండలం), చెరుకూరు పద్మజ(బల్లవోలు-చిల్లకూరు మండలం)తో పాటు, ప్రకృతి వ్యవసాయంలో బి.పార్వతి(చెన్నూరు-దగదర్తి మండలం), పట్టుపరిశ్రమలో ఎం.సీతారావమ్మ (పార్వతీపురం-అల్లూరు మండలం), పశుసంవర్ధక శాఖ పరిధిలో జి.హైమవతి (పురిణి కొత్తపాళెం-అల్లూరు మండలం), ఉద్యానపంటల్లో కోడూరు లక్ష్మీనరసమ్మ(నిండలి-బాలాయపల్లి మండలం), డిఆర్‌డిఏ పరిధిలో మారు బోయిన గోవిందమ్మ (జంద్రపేట-కొండాపురం మండలం)లు ఉన్నారు. వీరందరికీ వ్యవయసాయశాఖ జేడీఏ చంద్రానాయక్, ఏపిఎంఐపీ పి.డి సుభాని, ఆయా శాఖల అధికారులు పాల్గొని అవార్డులను బహుకరించారు. వెంకటాచలం మండలంలోని ఇడిమేపల్లి గ్రామానికి చెందిన ఉప్పు చిట్టెమ్మ రాష్ట్ర ఉత్తమ మహిళా రైతుగా విజయవాడలో అవార్డును స్వీకరించినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. వ్యవసాయ రంగంలో మహిళారైతులు స్వశక్తితో ముందుకు సాగుతున్నారని, వారికి ప్రభుత్వం అనేక ప్రయోజ నాలు చేకూర్చేదిశగా ముందుకు సాగుతోందని, ఈ ఏడాది నుంచి మహిళలకు 30శాతం నిధులను విధిగా వినియోగించాలని ప్రభుత్వం ప్రతిపా దించిందని ఈ కార్యక్రమంలో జేడీఏ చంద్రానాయక్ తెలిపారు. ఆహారోత్పత్తి, ఆహార భద్రత కల్పించడంలో గ్రామీణ మహిళలు, మహిళారైతుల పాత్ర ఎన్నటికీ మరువలేనిదని ఆయన కొనియాడారు. జిల్లా వ్యవసాయ రంగానికి ఈ ఏడాది 101 కోట్ల రూపాయలు వెచ్చించాల్సి ఉందని, అందులో మహిళా రైతులు, మహిళా వ్యవసాయ గ్రూపుల వికాసానికి 50 శాతం నిధులు ఖర్చుచేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గీతారాణి, ఆత్మ ఏపిడి మాధవి, కృషి విజ్ఞానకేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ ఎస్ఎం మునీంద్రనాయుడు, రైతు సాధికార సంస్థ డిపిఎం లక్ష్మీమాధవి, శాస్త్రవేత్తలు కె.అరుణ, సంధ్య, ఏడిఏలు అనిత, అనసూయ సుమలత పాల్గొన్నారు.

# మంచిదా!.. ముంచేదా?

## స్పష్టతలేని పరిశ్రమపై స్థానికుల ఆందోళన



కోట మండలంలోని సముద్ర తీర ప్రాంతమైన కొత్తపట్నం వద్ద లెదర్ కాంప్లెక్స్ నిర్మించడానికి గతంలో సన్నా హాలు జరిగాయి. అయితే దీనిపై స్థాని కులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తోళ్ళ పరిశ్రమ అయితే తమ భూములు ఇచ్చే ప్రసక్తే లేదని అడ్డం తిరిగారు. తోళ్ళ పరిశ్రమ వస్తే కాలుష్యం పెరుగుతుందని, భూగర్భ జలాలు కలుషితం అవుతాయని, ప్రజలు రోగాల బారిన పడుతారంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేయడంతో... అధికారులు వెనకడుగు వేశారు.

అక్కడ తోళ్ళ పరిశ్రమ కాదని బూట్ల పరిశ్రమ వస్తుందంటూ ప్రచారం మొదలు పెట్టారు. అయితే కొత్తపట్నం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 321, 525, 564లలో లెదర్ కాంప్లెక్స్ పెట్టాలను కున్నారు. స్థానికుల వ్యతిరేకతతో బూట్ల పరిశ్రమగా మార్చారు. అయితే దీనిపై ఇంతవరకు స్పష్టత లేదు. వచ్చే పరిశ్రమపై ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నాలు లేవు. దీంతో మళ్ళీ స్థానికుల్లో అనుమా నాలు మొదలయ్యాయి. ఈ ప్రాంతవాసులు 15వ తేదీ కోటలోని తహశీల్దార్ కార్యా లయం ఎదుట ఆందోళనకు దిగారు. అక్కడ పెట్టబోయే పరిశ్రమపై స్పష్టత ఇవ్వాలని అధికారులను డిమాండ్ చేశారు. ఇక్కడ తోళ్ళ పరిశ్రమను పెడితే మా బ్రతుకులు దెబ్బతింటాయని, మా ఆరో గ్యాలు పాడవుతాయని, కాబట్టి వచ్చే పరిశ్రమ ఏదో తెలపాలని, ఆ పరిశ్రమ ద్వారా భూములు కోల్పోయే వారికి ఉపాధి అవకాశాలు ఎలా కల్పిస్తారో స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

# ముమ్మరంగా విజిలెన్స్ తనిఖీలు

- 17 లారీలు స్వాధీనం

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈనెల 13వ తేది రాత్రి జిల్లాలోని పొదలకూరు జంక్షన్, నాయుడుపేట జంక్షన్, కావలి టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని 17 లారీలను ఆధీనంలోకి తీసుకున్నారు. పొదలకూరు చుట్టపక్కల కూడా తనిఖీలు నిర్వహించి కట్టెలు, బొగ్గును తరలిస్తున్న మరో 4 లారీలను అదుపులోకి తీసుకున్నారు. అధికలోడ్‌తో వెళ్తున్న 5 బ్లూమెటల్ లారీలు, 3 గ్రావెల్ లారీలు, 3 డస్ట్ లారీలు, కావలిలో 2 గ్రానైట్ లారీలను స్వాధీనం చేసుకుని వాటిని సీజ్ చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ శ్రీకంఠనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ దాడుల్లో డిఎస్పీ కెసి వెంకటసుబ్బయ్య, ఏఓ ధనుంజయరెడ్డి, ఇన్స్‌పెక్టర్ పి.వి నారాయణ, డిసిటిఓ రవి, ఏజీ రాము తదితర సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. అదేవిధంగా పొదలకూరు ప్రాంతంలో కట్టెలు, బొగ్గును తరలిస్తున్నారన్న సమాచారం అందుకుని ఆయా ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేసి 4 లారీలను విజిలెన్స్ అధికారులు పట్టుకుని వాటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి వెళ్ళారు.

సింహపురి సమాచారం

# సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి

## రాష్ట్ర ఎన్జీఓల సంఘం నేత డిమాండ్

ప్రభుత్వ ఉద్యోగులకు ఏమాత్రం భద్రత కల్పించలేని సిపిఎస్ విధానాన్ని రద్దు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకోవాలని రాష్ట్ర ఎన్జీఓల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 14న నెల్లూరు ఎన్జీఓ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లా డుతూ, కేంద్రంలోని పాలకులు స్వార్ధ బుద్ధితో కొత్త పింఛన్ విధానాన్ని అమలు లోకి తీసుకొచ్చి ఉద్యోగులను ఇబ్బందుల పాలుచేస్తున్నారని, దీనిపై సిఎం మంచి ఆలోచన చేసి తగు నిర్ణయం తీసుకోవా లన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23న గుంటూరులోని బిఆర్ స్టేడియంలో బహిరంగసభ నిర్వహించ నున్నామని, ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యో గులు, పింఛన్‌దారులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆ మేరకు బహిరంగసభ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు.

# న్యాయమూర్తి బదిలీ

నెల్లూరు 4వ అదనపు మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న కె. మురళీమోహన్‌ను రంగా రెడ్డి జిల్లా వికారాబాద్ 12వ అదనపు జిల్లా జడ్జిగా నియమిస్తూ తాజాగా రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ప్రస్తుతానికి ఇక్కడ ఎవరినీ నియమించలేదు కనుక, ఇన్‌ఛార్జిగా అద నపు జూనియర్ సివిల్‌జడ్జి ఆ బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

# టీడీపీకి ఆదిశేషయ్య గుడ్‌బై

ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బి.ఆదిశేషయ్య తన పదవికి ఈ నెల 15వ తేదీన రాజీనామా చేశారు. ఆదిశేషయ్య మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ముఖ్య అనుచరు డిగా వుంటున్నారు. రామనారాయణరెడ్డి ఇటీవలే వైసిపిలో చేరడం తెలిసిందే! రామ నారాయణరెడ్డి ఎక్కడ వుంటే నేనూ అక్కడే అంటూ ఆదిశేషయ్య టీడీపీకి గుడ్‌బై చెప్పారు. వైసిపిలో చేరాక ఆనం రామ నారాయణరెడ్డి ఈనెల 15న ఆత్మకూరులో ఆదిశేషయ్య ఇంటికెళ్ళి మాట్లాడడం జరిగింది. రామనారాయణరెడ్డిని అనుస రిస్తూ ఆదిశేషయ్య త్వరలో తన అను చరులతో కలిసి వైసిపిలో చేరనున్నారు.

# నెల్లూరులో ఫిలిప్పైన్స్ రీసెర్చి డైరెక్టర్

## అంతర్జాతీయ వరి పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు పరిశీలన

ఫిలిప్పైన్స్ దేశానికి చెందిన అంతర్జాతీయ వరి పరిశోధనా స్థానాన్ని నెల్లూరులో ఏర్పాటుచేసేందుకు ఫిలిప్పైన్స్ ఇంటర్నేషనల్ రైస్ రిసోర్స్ ఇన్‌స్టిట్యూట్ రీసెర్చి డైరెక్టర్ జనరల్ జాక్లి హ్యూజెస్ ఈనెల 14న నెల్లూరులోని వ్యవసాయ పరిశోధనాస్థానానికి విచ్చేశారు. ఇక్కడి శాస్త్రవేత్తలతో ఆమె చర్చించారు. నగరంలోని ముత్తుకూరురోడ్డులో ఉన్న వ్యవసాయ పరిశోధనా స్థానంలో నూతన వరి వంగడం సాగు తీరును, తోటపల్లి గూడూరులోని వరి పరిశోధనా క్షేత్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర వ్యవసాయమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.వి దామోదర్ నాయుడుల సూచనల మేరకు నెల్లూరులోని వ్యవసాయ పరిశోధనాస్థానాన్ని పరిశీలించా మన్నారు. అన్నీ అనుకూలిస్తే నెల్లూరులో ఫిలిప్పైన్స్ అంతర్జాతీయ వరి పరిశోధనా స్థానాన్ని ఏర్పాటుచేసే అవకాశం ఉందన్నారు. డా. వి.దామోదర్‌నాయుడు మాట్లాడుతూ, తోటపల్లిగూడూరులోని 20 ఎకరాల వరి పరిశోధనాక్షేత్రం, నెల్లూరులోని వ్యవసాయ పరిశోధనాస్థానంలోని కొంతభాగాన్ని వారి పరిశోధనలకు కేటాయించి, తద్వారా అంతర్జాతీయ స్థాయిలో వరి ధాన్యం ఎగుమతి చేసే రకాల వరి వంగడాలను ఇక్కడ సాగుచేసే అవకాశం ఉంటుందన్నారు. ఆ మేరకు 2కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులతో ఆ కేంద్రం ఏర్పాటుకు భవన నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. నెల్లూరు వ్యవసాయ పరిశోధనాస్థానం ప్రధాన శాస్త్రవేత్త డి.కోదండరామిరెడ్డి, విశ్రాంత ఐఐపిఆర్ ప్లాంట్ ప్రొటెక్షన్ హెడ్ జెఎస్ ప్రసాద్, భారత వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్త డా. అరవింద్‌కుమార్, అచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్తలు యు.వినీత, మధుసూదన్, పరమశివ, శ్రీలక్ష్మి, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారు

## - నిప్పులు చెరిగిన నల్లపరెడ్డి ప్రసన్న

రాష్ట్రంలో అవినీతి అక్రమాలు తాండవిస్తున్నాయని, ముఖ్య మంత్రి ఆయన కుమారుడితోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని వైఎస్సార్సీపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆరోపించారు. ఈ నెల 14న కోవూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ, అవినీతి అక్రమాల్లో రాష్ట్రం అగ్రభాగాన నిలిచిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా చంద్రబాబునాయుడు హయాంలో అవినీతి అక్రమాలు పెరిగి పోయాయన్నారు. అయినప్పటికీ రాష్ట్రంలో అవినీతి తగ్గిపోయిం దంటూ ఆర్భాటపు ప్రచారాలు చేయించుకోవడం దారుణ మన్నారు. చివరికి మట్టి, ఇసుకను కూడా దోచేస్తున్నారని దుయ్య బట్టారు. తెలంగాణాలో కెసిఆర్ ఆధ్వర్యంలో అక్కడ అభివృద్ధి జరుగుతుంటే, ఇక్కడ చంద్రబాబు పాలనలో దోపిడీ పెరిగిపో తున్నదన్నారు. ఒకప్పుడు రెండెకరాల ఆసామిగా ఉన్న చంద్రబాబు నాయుడు ఇప్పుడు లక్షల కోట్లు ఎలా సంపాదించాడో ప్రజలకు తెలియాల్సి ఉందన్నారు. తాను నిజాయితీపరుడినంటూ గొప్పలు చెప్పుకునే చంద్రబాబు నిజంగానే నిజాయితీపరుడైతే తన వ్యాపార సామ్రాజ్యంపై విచారణకు సిద్ధం కావాలన్నారు.

ఈ సమావేశంలో వైఎస్సార్సీపి జిల్లా నాయకులు నిరంజన్ బాబురెడ్డి, రాధాకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, వీరి చలపతి, నరసింహులు రెడ్డి, జనార్దన్‌రెడ్డి, శ్యామాచార్యులు, మల్లికార్జున్‌బాబు, జుబేర్, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో చాంబర్ ఆఫ్ కామర్స్ బృందం

ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన 18 మంది ప్రతినిధుల బృందం ఇటీవల శ్రీసిటీని సందర్శించింది. సంపత్ కుమార్ నేతృత్వంలో పర్యటనకు విచ్చేసిన వీరికి శ్రీసిటి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) శివశంకర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి శ్రీసిటి పారిశ్రామిక ప్రగతి, మౌలిక వసతులు, వ్యాపార అను కూల వసతులను గురించి వివరించారు. వివిధ వ్యాపారాల్లో మంచి నిర్వహణ సామర్థ్యం గల ఈ బృందం శ్రీ సిటీలో పర్యటించడం తమకు ఎంతో ప్రధానమని శ్రీసిటి ఎండి రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. దేశ సంపద, పురోగతి పెంపొందించేందుకు పరిశ్రమలు, వ్యాపారవేత్తలు, ప్రభుత్వాల మధ్య ఈ సంస్థ వారధిగా ఉంటుందని పేర్కొన్నారు.

## అభివృద్ధి కోసం టీడీపీ...
# అవినీతి బాటలో బీజేపీ
### - మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో అగ్రస్థానంలో నిలిపేందుకు మేం కృషి చేస్తుంటే, వైసిపి, బీజేపీ నాయకులు ఏపిని అవినీతి రాష్ట్రంగా ప్రపంచానికి చూపాలని నానా ప్రయత్నాలు చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. ఈనెల 15వతేదీన ముత్తుకూరు మండలం మిట్టపాలెంలో కృష్ణపట్నం ఆయిల్ ప్యాకింగ్ ఇండస్ట్రీని ఆయన ప్రారంభించారు. మంచి వ్యాపార వేత్తగా ఎదగాలంటూ ఇండస్ట్రీ అధినేత దువ్వూరు కృష్ణతేజరెడ్డికి తన అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపిపై అవినీతి ముద్ర వేసి ఏపికి రావాల్సిన పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించాలని బీజేపీ, వైసిపిలు కుట్ర చేస్తున్నాయని, వాళ్ళు ఎన్ని పన్నాగాలు పన్నినా నవ్యాంధ్ర అభివృద్ధిని అడ్డుకోలేరని పేర్కొన్నారు. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ఇండియా నిర్వహించిన తాజా సర్వేలో అవినీతి తక్కువగా వున్న మూడు రాష్ట్రాల్లో ఏపి ఒకటిగా ఉందని, బీజేపీ పాలిత రాష్ట్రాలైన యూపి, మధ్య ప్రదేశ్, మహారాష్ట్రలు అవినీతి జాబితాలో ముందువరుసలో వున్నాయన్నారు. తెలుగు నేలపై పుట్టిన కొందరు వైసిపి, బీజేపీ నాయకులు ఈ భూమికే భారంగా మారారని ఎద్దేవా చేశారు. తిత్లి తుఫాన్‌ను ఒంటి చేత్తో అడ్డుకుని శ్రీకాకుళం జిల్లా ప్రజలను ఆదుకున్న ఘనత చంద్రబాబుదేనని సోమిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి టీడీపీ ఇన్‌ఛార్జ్ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి కూడా పాల్గొన్నారు.


కృష్ణపట్నం ఆయిల్ ప్యాకింగ్ ఇండస్ట్రీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పక్కన సర్వేపల్లి టిడిపి ఇన్‌ఛార్జ్ సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

## నేను లోక్‌సభ...
# ఆయన ఆత్మకూరు!
- ప్రకటించేసిన ఆదాల



ఇటీవల చేజర్ల మండలంలోని నాగులవెల్లటూరులో జరిగిన ఓ వివాహ వేడుకకు బొల్లినేని కృష్ణయ్య, గూటూరు కన్నబాబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణయ్యతో కన్నబాబు... ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నమ్మవద్దంటూ వాదనకు దిగారు. ఇది మీడియాలో హల్‌చల్ చేసింది. ఈ నేపథ్యంలోనే ఆదాల 15వతేదీన నెల్లూరులోని మంత్రి నారాయణ క్యాంప్ కార్యాలయంలో ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. బొల్లినేని కృష్ణయ్య కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదాల అభ్యర్థిత్వాలపై తేల్చి చెప్పారు. నెల్లూరు లోక్‌సభ నుండి తాను, ఆత్మకూరు నుండి బొల్లినేని కృష్ణయ్యలు పోటీ చేస్తున్నట్లు చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని అక్కడ పరిస్థితులు తెలిసిన బొల్లినేని కృష్ణయ్యను పోటీ చేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారని, ఆయన కోరిక మేరకే కృష్ణయ్య రంగంలోకి దిగాడని చెప్పారు. ఆత్మకూరు ఇన్‌ఛార్జ్‌గా నేను, అభ్యర్థిగా కృష్ణయ్య ఇద్దరం కలిసి నియోజకవర్గంలో తిరుగుతున్నామని, తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నా మని చెప్పారు. తమకు అలివిగాని సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం సాధిస్తామన్నారు. కృష్ణయ్యకు ఇటు అమరావతిలో అటు ఢిల్లీలో బాగా పరపతి వుందని, ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ఏ పనైనా సాధించు కొస్తాడని ఆదాల చెప్పారు. ఈ సమావేశంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, టీడీపీ నాయకులు రావూరు సుందరరామిరెడ్డి, ఇందూరు వెంకటరమణారెడ్డి, హరిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న కంటి వెలుగు...
# ప్రతి ఇంటా చీకట్లు తొలుగు
### - ఎమ్మెల్యే అనిల్



నెల్లూరు నగరంలోని 47, 48 డివిజన్‌లకు చెందిన ప్రజలకు కుక్కలగుంట మహాలక్ష్మమ్మ దేవాలయం వద్ద గల మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మోడరన్ ఐ హాస్పిటల్ వారి సహకారంతో సొంతంగా ఏర్పాటు చేసిన రాజన్న కంటి వెలుగు కార్యక్రమాన్ని నెల్లూరు నగర శాసనసభ్యులు డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్ 15వ తేదీ పర్యవేక్షించారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ రాజన్న కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు దాదాపు 3వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని, 800 మంది వరకు ఉచితంగా కంటి అద్దాలు సిద్ధం చేస్తున్నామని, అలాగే మోడరన్ ఐ హాస్పిటల్ వారి సహకారంతో 50మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించడం జరిగిందన్నారు. రాజన్న కంటి వెలుగు కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం నవంబర్ 2 వరకు నిర్వహిస్తున్నామని, అవసరమైతే కొన్ని రోజులు పొడిగించి పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుంచాల కృష్ణవేణి, నాయకులు శివపురం సురేష్, కుంచాల శ్రీనివాసులు, రామయ్య, జావీద్, ఓబ్ని రవికుమార్, ఎస్‌కె.మున్నా, ఇలియాజ్, షఫి, శ్రీనివాసులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## చెంగాళమ్మకు
# పుష్పయాగం



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారికి ఈ నెల 14న నేత్రపర్వంగా పుష్పయాగం నిర్వహించారు. ఆలయ అర్చకులు అనేకరకాల సుగంధభరిత పుష్పయాగాలతో అమ్మవారిని అర్చించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. నంబూరు లేబొరేటరీ అధినేత నంబూరు మోహన్ రావు, సులోచనమ్మ, అలయన్స్ గ్రూప్ ఛైర్మెన్ నంబూరు మనోజ్‌సాయి, లత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ఇ.ఓ ఆళ్ళ శ్రీనివాసులురెడ్డి, కిన్నెరగ్రాండ్ హోటల్ అధినేత బద్దెపూడి సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మా పరుగు... శాంతి భద్రతల మెరుగు కోసమే!
### - అడిషనల్ ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి



విధి నిర్వహణలో అశువులు బాసిన వారి త్యాగాలు మనకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని జిల్లా అదనపు ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 15న నెల్లూరులో మారథాన్ రన్ నిర్వహించారు. పోలీసు పెరేడ్ గ్రౌండ్స్ నుంచి ప్రారంభమైన ఈ పరుగు మాగుంట సర్కిల్ మీదుగా మద్రాసుబస్టాండు వరకు కొనసాగింది. 'పోలీసు అమరవీరులకు జోహార్'..అంటూ నినదిస్తూ తిరిగి పెరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకుంది. అనంతరం అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ, అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించడమే ఈ పరుగు లక్ష్యమన్నారు. ఎన్ని శక్తులు అడ్డువచ్చినా తమ విధుల్లో ఏమాత్రం వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి పోలీసు ఇదే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. ఈ వారం రోజులు పోలీసులకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అదనపు ఎస్పీ (క్రైమ్స్) ఆంజనేయులు, ఏఆర్ అదనపు ఎస్పీ వీరభద్రుడు, నగర డిఎస్పీ ఎన్‌బిఎం మురళీకృష్ణ, ఏఆర్ డిఎస్పీ చంద్రశేఖర్, ఎస్సీఎస్టీ సెల్ డిఎస్పీ శ్రీనివాసాచారి, రూరల్ సిఐ శ్రీనివాసరెడ్డి, నవాబుపేట సిఐ వెంకట్రావు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, గౌరవాధ్యక్షుడు గంగాధర్, ఆర్ఐలు మౌలాలుద్దీన్, రమేష్‌కృష్ణన్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


ఇటీవలే తండ్రిని కోల్పోయిన నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డిని ఈ నెల 13న నెల్లూరులోని ఆయన ఇంట్లో కలిసి పరామర్శిస్తున్న మాజీ ఒంగోలు పార్లమెంటు సభ్యులు వై.వి.సుబ్బారెడ్డి



# 'ప్రభా'తం

వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీఏ కేబినెట్ ఎలా వుండేది. ఎల్.కె.అద్వానీ, జార్జి ఫెర్నాండేజ్, మురళీమనోహర్ జోషి, వెంకయ్యనాయుడు, నితీష్‌కుమార్, యశ్వంత్ సిన్హా, మమత బెనర్జీ... వంటి మహామహులతో సమర్థవంతంగా కనిపించేది. ప్రతిశాఖ తరఫున పనితీరు భేషుగ్గా కనిపించేది. వాళ్ళు చేసింది ప్రజలకు కనిపించేది. వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో టీమ్ స్పిరిట్ ఉండేది. పదిమంది మాట్లాడేవాళ్ళు. ప్రభుత్వ నిర్ణయాలను ఎప్పటికప్పుడు చెప్పేవాళ్ళు. ప్రతిపక్షాల ఆరోపణలకు అప్పటికప్పుడు సమాధానమిచ్చేవాళ్ళు. విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పి కొడుతుండేవాళ్ళు.

అప్పటి వాజ్‌పేయి ఎన్డీఏ ప్రభుత్వానికి ఇప్పటి నరేంద్ర మోడీ ఎన్డీఏ ప్రభుత్వానికి తేడా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ ఎన్డీఏ ప్రభుత్వం కేవలం డబుల్ మెన్ షోగా మారింది. ఒకరు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రెండోవారు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా. ప్రభుత్వంలో మోడీ, పార్టీలో అమిత్‌షాల హవా తప్ప రెండో మనిషితో పనే లేకుండా పోయింది. ప్రభుత్వంలో మోడీది వన్‌మెన్‌షో. కేంద్ర కేబినెట్‌పై ఆయన నియంత్రణ ప్రమాణస్వీకారోత్సవం జరిగిన క్షణం నుండే మొదలైంది. ముఖ్యంగా యూపీఏ ప్రభుత్వంలో జరిగిన కుంభకోణాలు తన పాలనలో చోటు చేసుకోకూడదనే ముందుచూపుతోనే ఆయన మంత్రులను కంట్రోల్‌లో పెట్టాడు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్ళలోనే ఆయన ఒక ట్రెండు కేసులకు సంబంధించి తన సహచర మంత్రి వర్గ సభ్యులకు ఇలాంటివి పునరావృతం కానీయొద్దంటూ సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చాడని సమాచారం. అవినీతి అక్రమాలు చోటుచేసుకోకుండా మంత్రులను క్రమశిక్షణలో, క్రమ పద్ధతిలో పెట్టాలనుకోవడం మంచిదే కాని, మరీ ఆ నియంత్రణ శృతి మించితే లేనిపోని సమస్యలొస్తాయి. ఇప్పుడు కేంద్రంలో అటువంటి పరిస్థితులే నెలకొన్నాయి. ప్రతి మంత్రి తమ శాఖకు సంబంధించిన పనులు తాము చేసుకుపోతున్నారు. వాజ్‌పేయి కేబినెట్‌లోలాగే మోడీ కేబినెట్‌లోనూ నిజాయితీపరులు, సమర్థులు మంత్రులుగా వున్నారు. ఏ మంత్రుల మీద కూడా అవినీతి ఆరోపణలు లేవు. అయితే ఏ మంత్రిత్వశాఖలో ఏం జరుగుతుందన్నది ప్రజలకు తెలియడం లేదు. మంత్రులు చెప్పుకోలేకపోతున్నారు. మీడియా వెల్లడించడం లేదు. ప్రజలకు తెలియడం లేదు. ఆఖరకు ప్రధాని మోడీ కూడా కాంగ్రెస్‌ను విమర్శించడానికి ఇస్తున్నంత ప్రాధాన్యత తమ ప్రభుత్వం చేసిన పనులను చెప్పుకోవడానికి ఇవ్వడం లేదు.

## రచ్చ సరే... ఇంట గెలిచేదెలా?



అప్పటి వాజ్‌పేయి ఎన్డీఏ ప్రభుత్వానికి ఇప్పటి నరేంద్ర మోడీ ఎన్డీఏ ప్రభుత్వానికి తేడా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ ఎన్డీఏ ప్రభుత్వం కేవలం డబుల్‌మెన్ షోగా మారింది. ఒకరు ప్రధానమంత్రి నరేంద్రమోడీ, రెండోవారు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా. ప్రభుత్వంలో మోడీ, పార్టీలో అమిత్‌షాల హవా తప్ప రెండో మనిషితో పనే లేకుండా పోయింది. ప్రభుత్వంలో మోడీది వన్‌మెన్‌షో. కేంద్ర కేబినెట్‌పై ఆయన నియంత్రణ ప్రమాణస్వీకారోత్సవం జరిగిన క్షణం నుండే మొదలైంది.

ఈ నాలుగున్నరేళ్ళలో మోడీ ప్రభుత్వం జనాలకు ఏం చేసింది? అన్న ప్రశ్న వస్తే... దానికి సమాధానం చాలా కష్టంగానే వుంటుంది. ఎందుకంటే మోడీ ప్రభుత్వం ప్రజలకంటే కూడా దేశానికే ఎక్కువ చేసింది. ఇక్కడ దేశమంటే ప్రజలే. కాని ప్రత్యేకంగా ఎన్నికలొచ్చేసరికి ప్రజలైనా, పార్టీలైనా దేశాన్ని, ప్రజలను వేర్వేరుగా చూస్తుంటాయి. మోడీ ప్రభుత్వం ప్రపంచంలో భారత దేశ ఇమేజ్‌ను పెంచింది. దేశానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చింది. ఎన్నో దౌత్య విజయాలు సాధించింది. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదంపై పోరుకు మద్దతు సమీకరించింది. అగ్రరాజ్యం అమెరికాకు అత్యంత ఆప్తమిత్ర దేశంగా గుర్తింపు పొందింది. అదే సమయంలో రష్యా, ఇజ్రాయిల్, యూరోపియన్, అరబ్ దేశాలతో సైతం తన స్నేహ సంబంధాలను బలోపేతం చేసుకుంది. సరిహద్దు వివాదాల విషయంలో చైనా బెదిరింపులను ఏ మాత్రం ఖాతరు చేయకుండా నిలబడింది. ప్రపంచ దేశాల దృష్టిలో పాక్‌ను ఉగ్రవాద దేశంగా చూపించగలిగింది. ఆసియా ఖండంలో చైనాకు దగ్గరవుతున్న నేపాల్, శ్రీలంక, మాల్దీవులు వంటి దేశాలను తిరిగి తన దారికి తెచ్చుకోగలిగింది. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆలీన విధానం ద్వారా భారత్‌ను అన్ని దేశాలకు దూరంగా పెడితే, మోడీ మాత్రం ఆలింగనం విధానం ద్వారా అటు ట్రంప్‌ను, ఇటు పుతిన్‌ను అలాగే శతృమిత్రదేశాలనూ తన దారికి తెచ్చుకున్నాడు. ఈ నాలుగున్నరేళ్ళలో బయట నుండి ఒక్క రూపాయి అప్పు తేకుండా దేశాన్ని ప్రపంచంలోనే ఆర్థిక శక్తిగా రూపుదిద్దుతున్నాడు.

అయితే మోడీ ఇంతవరకు రచ్చగెలిచాడు. కాని, ఇంట గెలవడానికి ఏం చేశాడు? ఆయన విదేశీ విధానాలు, దౌత్యపర విజయాలు దేశ ప్రజల మనసులకు ఎక్కవు. వీటి గురించి దేశంలో 10శాతం మంది కూడా ఆలోచించరు. మోడీ వచ్చి దేశ ప్రతిష్టను పెంచాడు. ఉగ్రవాద దాడులు లేకుండా చేసాడు. దేశ భద్రతను పటిష్టం చేశాడు అనే విషయాలకు ప్రజలలో అంత ప్రాధాన్యత వుండదు. మోడీ వచ్చి నాకేం చేశాడు? అన్న ప్రశ్నే ప్రజల్లో ఎక్కువగా వుంటుంది. వచ్చి ఋణమాఫీ చేశాడా? కొత్త అప్పులు ఇచ్చాడా? జనధన్ ఖాతాలో డబ్బులేమన్నా వేశాడా? ఉచిత టీవీలు, ఉచిత బియ్యం, రేషన్ సరుకులు ఇచ్చాడా? నెలకో రెండువేలు సరదాగా గడపమనేమన్నా ఇచ్చాడా? ఫ్రీ కరెంట్ ఇచ్చాడా? ఎక్కువమంది ప్రజలను ప్రభావితం చేసేది ఇలాంటి పనులే! అది ప్రజల తప్పు కూడా కాదు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి దేశాన్ని ఏలిన కాంగ్రెస్‌పార్టీ మెజార్టీ శాతం ప్రజలను ఆ విధంగా చేసింది. ఈరోజు మోడీ దేశాన్ని ఆర్థికంగా అగ్ర స్థానంలో నిలబెట్టాడా? సైనిక శక్తిలో చైనాకు ధీటుగా పెంచాడా? ఉగ్రవాదాన్ని నిర్మూలించాడా? ఇవి కాదు రేపు ఎన్నికల ప్రచారాస్త్రాలు. నోట్లు రద్దు చేసి జనాలను క్యూలలో నిలబెట్టాడు... జీఎస్టీతో వస్తువుల రేట్లు పెరిగాయి. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించ లేదు... రాహుల్ ఊదరగొడుతున్నట్లు రాఫెల్ డీల్‌లో లక్షకోట్ల అవినీతి... ఇవి ప్రజల మెదళ్ళలోకి ఎక్కే అంశాలు. రాఫెల్ డీల్‌పై ప్రతిపక్షం ఇంత రచ్చ చేస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం వైపు నుండి ఈ అంశంపై క్లారిటీ ఇచ్చే ప్రయత్నం జరగలేదు. ఎన్నికలు సమీపిస్తున్నాయి. మోడీ ప్రభుత్వం ఇంకా ప్రచారంలోకి వెళ్ళలేదు. మేము ఇది చేసాము అని చెప్పుకునే ప్రయత్నం కూడా చేయడం లేదు. విదేశాంగ విధానం మాటెలా వున్నా ఆర్థిక సంస్కరణలో మోడీ సర్కార్ కొన్ని తప్పటడుగులు వేస్తోంది. దేశాన్ని ఆర్థికంగా శక్తివంతం చేసే క్రమంలో ప్రజలను ఎండబెడుతోంది. ఈ పరిణామాలు రేపు ఆ పార్టీకే నష్టం కలిగిస్తాయి. దేశ ప్రజలకు ఏ రూపంలో మేము మేలు చేసామనేది వాళ్ళు ఇప్పటికైనా చెప్పుకోకపోతే, మోడీ నిర్లక్ష్యానికి బీజేపీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది. ఎందుకంటే ఇప్పటివరకు జరిగిన ఆయా రాష్ట్రాల ఎన్నికలు, గెలుపోటములు ఒక ఎత్తు, రాబోయే సార్వత్రిక ఎన్నికలు మరో ఎత్తు. మోడీ, అమిత్‌షాలిద్దరే ఎన్నికల సుడిగుండాన్ని ఈది దాటుతోందంటే అది అతివిశ్వాసమే అవుతుంది. పార్టీ నాయకత్వాన్ని ఇప్పటికైనా కలుపుకుని ప్రజలలోకి వెళ్ళకుంటే బీజేపీ పుట్టిని ముంచిన ఘనత మోడీ, షాలదే అవుతుంది.

## భక్తిశ్రద్ధలతో వెంకయ్యస్వామి ఆరాధన

కొత్తూరు పరిధిలోని శ్రామికనగర్‌లో కొలువైవున్న భగవాన్ వెంకయ్యస్వామి ఆలయంలో 15వ వార్షికోత్సవ ఆరాధనోత్సవాలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ నెల 13 నుంచి 16వ తేదీవరకు జరిగిన ఈ కార్యక్రమాల్లో తొలుత గణపతి హోమం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అశ్వత్థనారాయణ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యస్వామికి విశేషపూజలు నిర్వహించి భజనలు చేశారు. ఆలయ ధర్మకర్త ఎం. నీరజమ్మ తదితరులతో పాటు భక్తులు పెద్దసంఖ్యలో ఈ ఆరాధనోత్సవాల్లో పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో మాకూ చోటివ్వండి

దేవదేవుడు శ్రీనివాసుని సేవ చేసుకునే అవకాశాన్ని మాకు కూడా కల్పించండని కోరుకుంటున్నారు పద్మశాలీలు. ఈ నెల 14వ తేదీన నెల్లూరులోని ఎంసిఎస్ కళ్యాణ మండపంలో పద్మశాలీ సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.ఎస్. చక్రధారి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో 11శాతంగా వున్న పద్మశాలీలకు టీటీడీ పాలక మండలిలో స్థానం కల్పించాలని కోరారు. పద్మశాలీలు రాజకీయంగా ముందడుగు వేయాలన్నారు.

ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి మాడా జానకిరామయ్య, నాయకులు అల్లూరు గజపతిరావు, జి.మురళి, కె.బాలసూర్యనారాయణ, సి. పెంచలయ్య, సి. హెచ్.పద్మావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తిన్నదంతా కక్కించాలి!

రాష్ట్రంలో పలువురు నాయకుల మీద ఆదాయపన్ను శాఖాధికారులు దాడులు చేస్తుంటే చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేష్‌లు భరించలేకపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ మీద కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దాడిగా దీనిని అభివర్ణించి ప్రాంతీయ తత్వాన్ని రెచ్చగొట్టాలని చూస్తున్నారు. ఎంపి సీఎం రమేష్ వేలకోట్లు దోచాడు. ఇవన్నీ కూడా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ నాలుగున్నరేళ్ళలో సంపాదించినవే! రాష్ట్రంలో పెద్దపెద్ద ఇరిగేషన్ కాంట్రాక్ట్‌లు ఆయనవే! వందతో అయ్యే పనిని ఐదొందలకు పెంచి ఆయనకు అప్పగించారు. ఇందులో ప్రభుత్వ పెద్దలకు వాటా ఎంతుందన్నది విచారణలో తేలాలి. రాష్ట్రంలో అవినీతి గద్దలు పెద్దల ముసుగులో చాలానే వున్నాయి. అవి తిన్న అవినీతి సంపాదనంతా కేంద్రం కక్కించాలి.

**జూపాలి కామేశ్వర్, శ్రీకాళహస్తి.**

## కాలగర్భంలోకి కమ్యూనిజం

ఈ ప్రపంచంలో ప్రతి దేశానికి సొంత సంస్కృతి ఒకటి వుంటుంది. ఆ దేశ ప్రజలు తమ సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తారు. ఏ రాజకీయ పార్టీ అయినా, ప్రభుత్వమైనా ఆ సంస్కృతిని గౌరవించాల్సిందే! ఇలా ఆయా దేశాల సంస్కృతిని గౌరవించకపోవడం వల్లే కమ్యూనిజం అంతరించి పోతోంది. భారతదేశంలోనూ ఆ పార్టీ సిద్ధాంతాలకు బూజుపట్టింది. ఒక్కో రాష్ట్రంలో కనుమరుగవుతోంది. కంచుకోట లాంటి పశ్చిమ బెంగాల్‌లో తుడిచిపెట్టుకుపోయారు. త్రిపురలో అధికారాన్ని కోల్పోయారు. ఇప్పుడు కేరళలోనూ ఆ పరిస్థితులను కొని తెచ్చుకుంటున్నారు. దేశంలో మెజార్టీ హిందువుల మనోభావాలను గాయపరిచే విధంగా కమ్యూనిష్టుల చేష్టలున్నాయి. ఈమధ్య ఓ సీపీఎం మహిళా ఎంపి హిందూ మహిళా భక్తుల గురించి చేసిన వ్యాఖ్యలు వారి దిగజారుడుతనాన్ని బయటపెడుతోంది. దేశంలోని హిందువులను గౌరవించని ఏ పార్టీకీ మనుగడ వుండదు. ఇది చారిత్రక సత్యం.

**- సి. రాజీవ్, నెల్లూరు.**




## పర్యావరణానికి చేటు

నెల్లూరుజిల్లాలో క్రమ పద్ధతిలో వర్షాలు కురవడం లేదు. కాలాలు మారుతున్నాయి. సంవత్సరంలో పది నెలలు ఎండా కాలాన్ని తలపిస్తోంది. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఒకప్పుడు జూలైలో మంచి వర్షాలు పడేవి. ఇప్పుడు ఏడాది పొడవునా ఎండలే! ఆఖరకు ఈశాన్య ఋతుపవనాల ప్రభావం కూడా జిల్లాలో లేకుండా పోతోంది. అడవులు తగ్గిపోవడం, కాలుష్యం పెరగడం, నగరాలు కాంక్రీట్ జంగిల్‌గా తయారు కావడం వంటి వాటితో జిల్లాలో పర్యావరణం దెబ్బతింటోంది. చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై వుంది.

**- జి.ఎస్.రావు, నెల్లూరు.**

## 'రెడ్లు' అంటే ఫ్యాక్షనే కాదు!

తెలుగు సినిమాలలో రెడ్లను ఫ్యాక్షనిష్టులుగా చూపడం ఒక ఆనవాయితీ అయిపోయింది. రాయలసీమ అంటే ఇక ఫ్యాక్షనిజమేనా? అక్కడ చూపించడానికి ఇంకేమీ లేదా? రెడ్లలో ఫ్యాక్షనిష్టులు తప్ప ఇంకెవరూ లేరా? అయినా ఫ్యాక్షనిజానికి వాళ్ళకు వాళ్ళే బలయ్యారు. ఆ కులస్థులే ఒకర్నొకరు నరుక్కుని చచ్చారు. కృష్ణా జిల్లాలో వుండే రౌడీయిజం కన్నా ఇదేమీ గొప్పది కాదు. తెలుగు సినిమావాళ్ళు తమ కథలకు కులాలను వాడుకోవడం మానేస్తే మంచిది.

**- జి.వి.శ్రీనాథ్‌రెడ్డి, కావలి.**



# మారుతున్న రాజకీయం

## ఫుల్‌టైం పోయి... అంతా పార్ట్‌టైమ్!

*ఒకప్పుడు రాజకీయ నాయకులు ఎలావుండేవాళ్ళు... అధికారంలో వున్నోళ్లయినా, ప్రతిపక్షంలో వున్నోళ్లయినా... పూర్తిగా రాజకీయాలకే అంకితమై వుండేవాళ్ళు. వాళ్ళ వ్యాపారం, వృత్తి, ఉద్యోగం అంతా కూడా రాజకీయమే.*

బెజవాడ గోపాలరెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య,వెంకయ్యనాయుడు, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, దొడ్ల కామాక్షయ్య, స్వర్ణ వేమయ్య, కలికి యానాదిరెడ్డి, పసల పెంచలయ్య, కె.వి. సుబ్బారెడ్డి, నువ్వుల వెంకటరత్నంనాయుడు, ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డి, ఆనం సంజీవరెడ్డి, సి.వి.శేషారెడ్డి, జక్కా వెంకయ్య, ధనెంకుల నరసింహం, బెజవాడ పాపిరెడ్డి, డాక్టర్ బి.సుందరరామిరెడ్డి, డాక్టర్ వి.వి. ఆర్.కె. యాచేంద్ర, ఆనం వివేకానందరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామ నారాయణరెడ్డి... గత జిల్లా రాజకీయాలను పరిశీలిస్తే రాజకీయమే వ్యాపకంగా వున్న నాయకులే మనకు కనిపిస్తారు. వీళ్ళకు బరువు, బ్రతుకు, బాధ్యత అంతా రాజకీయమే! నిరంతరం ప్రజల మధ్య ఉండడం, ప్రజల సమస్యలపై పోరాడడమే వారి దైనందిన జీవితంగా ఉండేది. గతంలో జిల్లాలో ఒక లోక్‌సభ, 11 అసెంబ్లీ స్థానాలుంటే అన్ని స్థానాలలోనూ ఫుల్‌టైం పొలిటీషియన్స్ ఎన్నికైవుండే వాళ్ళు. గెలిచినా, ఓడినా అందరూ పూర్తికాలం రాజకీయాలకే అంకితమైన నాయకులు ఆ కాలంలో వుండేవాళ్ళు.

రాజకీయాలలోకి కాంట్రాక్టర్‌లు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు ఎప్పుడైతే ప్రవేశించారో, రాజకీయాలలో డబ్బు ప్రభావం ఎప్పుడైతే మొదలైందో... అప్పటి నుండే పూర్తికాలం రాజకీయ నాయకులు తెరమరుగు కాసాగారు. పార్ట్‌టైం పొలిటీషియన్స్ రాజకీయాలను ఆక్రమించుకుంటూ రాసాగారు. కాల క్రమంలో జిల్లా రాజకీయాలపై పార్ట్‌టైం పొలిటీషియన్స్‌దే పైచేయి అయ్యింది.

2014 ఎన్నికలనే చూద్దాం... నెల్లూరు లోక్‌సభ స్థానం నుండి గెలిచిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఒక కాంట్రాక్టర్. ఆయన మీద పోటీ చేసి ఓడిపోయిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా కాంట్రాక్టరే! ఎమ్మెల్యేగా గెలిచిన వాళ్ళలో రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బిల్డర్, బొల్లినేని రామారావు కాంట్రాక్టర్, కురుగొండ్ల రామకృష్ణ వ్యాపారవేత్త, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి రియల్టర్, మేకపాటి గౌతంరెడ్డి కాంట్రాక్టర్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి వ్యాపారవేత్త. 2014 ఎన్నికల్లో గెలిచిన వాళ్ళలో ఏ వ్యాపారాలు, కాంట్రాక్ట్‌లు లేకుండా వున్నది నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్‌లే! సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఉద్యోగాన్ని వదిలి వచ్చాడు. పాశం సునీల్‌కు కాంట్రాక్ట్‌లు, వ్యాపారాలు ఏమీ లేవు.

2019 ఎన్నికల రేసులో కూడా పార్ట్‌టైం పొలిటీషియన్స్ ఎక్కువుగా రంగంలో వుండబోతున్నారు. ఎంపి సీటుకు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే సీట్లకు వ్యాపార, కాంట్రాక్ట్, పారిశ్రామిక రంగాలకు చెందిన పి.నారాయణ, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, బొల్లినేని కృష్ణయ్య, బొల్లినేని రామారావు, కావ్య కృష్ణారెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మేకపాటి గౌతమ్ రెడ్డిలు రేస్‌లో వున్నారు.

పూర్తికాలం రాజకీయ నాయకులుగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామ నారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, కిలివేటి సంజీవయ్య, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి.. వంటి నాయకులు టీడీపీ, వైసిపిల తరపున టిక్కెట్ల రేసులో వున్నారు. అభ్యర్థుల ఎంపికలో ఈసారి కూడా పార్ట్‌టైం నాయకులకే ప్రాధాన్యత దక్కనుంది.

# ఉదయగిరి అభ్యర్థుల నిర్ణేతలెవరు?




***జిల్లాలో మిగతా నియోజకవర్గాలన్నీ ఒకెత్తు.. ఒక్క ఉదయగిరి అసెంబ్లీ మాత్రం మరో ఎత్తు. ఈ ప్రాంతం అభివృద్ధి పరంగా వెనుకబడి వుంటుందనేగాని రాజకీయ పరిజ్ఞానంలో మాత్రం చాలా ముందుంటుంది. రాజకీయ పార్టీల అధిష్టానాలను సైతం ఆదేశించే స్థాయిలో ఈ ప్రాంతానికి చెందిన నాయకులుంటుంటారు.***

జిల్లాలోని మిగతా నియోజకవర్గాలకు పార్టీ అధిష్టానాలే అభ్యర్థులను నిర్ణయిస్తుంటాయి. కాని, ఉదయగిరికి మాత్రం స్థానిక నాయకులే తమకు ఈ అభ్యర్థి కావాలని అధిష్టానానికి సూచిస్తుంటారు. వాళ్ళు సూచించిన అభ్యర్థికి సీటివ్వలేదంటే ఓడించడానికి కూడా వెనుకాడరు.

ఎలక్షన్‌ల టైం దగ్గరపడుతున్న తరుణంలో ఉదయగిరిలో మళ్ళీ అటువంటి రాజకీయాలే చోటు చేసుకుంటున్నాయి. ఈసారి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి సీటివ్వొద్దంటూ ఇటీవల ఉదయగిరి నియోజకవర్గ ద్వితీయ శ్రేణి నాయకులు కొందరు జగన్‌ను స్వయంగా కలిసి కోరడం జరిగింది. చంద్రశేఖర్‌రెడ్డికి బదులు వాళ్ళ కుటుంబంలో నుండే మరొకరిని ఉదయగిరి అభ్యర్థిగా పెట్టాలని వాళ్ళు కోరుతున్నారు.

అలాగే టీడీపీలోనూ ఇదే పరిస్థితి. నియోజకవర్గంలో ప్రజలకు గాని, పార్టీ కార్యకర్తలకు గాని అందుబాటులోలేని ప్రస్తుత ఎమ్మెల్యే బొల్లినేని రామారావుకు మళ్ళీ సీటు ఇవ్వొద్దని మండలస్థాయి నాయకులు పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నారు. ఈ నియోజకవర్గ టీడీపీ నేతలు కొందరు మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి పేరును అభ్యర్థిగా ప్రతిపాదిస్తుండగా, ఇంకొందరు కావ్య కృష్ణారెడ్డికి మద్దతునిస్తున్నారు. తాజాగా వరికుంటపాడు మండలంకు చెందిన బిల్డర్ ఎర్రా బ్రహ్మయ్య అనే నాయకుడు కూడా సీటును ఆశిస్తున్నాడు. మరి వైసిపి అయినా టీడీపీ అయినా స్థానిక నాయకుల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిచ్చి అభ్యర్థులను ఎంపిక చేస్తాయో, లేక తమ ఆలోచనా ధోరణితోనే అభ్యర్థుల ఎంపికపై ముందుకుపోతాయో చూడాలి!?

# గెలుపు 'వరప్రసాద'మేనా?



అతను ప్రజారాజ్యం పార్టీ తరపున ఎంపీనవుతాననుకున్నాడు. కాని, అతని నుదుటి మీద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి ఎంపీ అవుతాడని వ్రాసిపెట్టి ఉంది. అదే జరిగింది. తిరుపతి ఎంపి వెలగపూడి వరప్రసాద్ 2009లో తిరుపతి లోక్‌సభ నుండి ప్రజారాజ్యం అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోవడం తెలిసిందే! చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడం, ఆ తర్వాత జగన్ వైసిపిని స్థాపించడంతో ఆయన వైసిపిలో చేరడం, 2014 ఎన్నికల్లో తిరుపతి లోక్‌సభకు వైసిపి అభ్యర్థిగా విజయం సాధించడం జరిగిపోయాయి. 2014 ఎన్నికల్లో తిరుపతి లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో గూడూరు, సూళ్లూరుపేట, సర్వేపల్లి, సత్యవేడు... నాలుగు స్థానాలలో వైసిపి గెలవగా వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి స్థానాలను టీడీపీ గెలుచుకుంది. ఆ ఎన్నికల్లో పొత్తులో భాగంగా తిరుపతి సీటును బీజేపీకి ఇవ్వడం వరప్రసాద్‌కు కలిసొచ్చింది. బీజేపీ అభ్యర్థి కారుమంచి జయరాం వీక్ కావడంతో లోక్‌సభలో క్రాస్ ఓటింగ్ బాగా జరిగింది.

తిరుపతి లోక్‌సభకు ఈసారి తెలుగుదేశం అభ్యర్థే రంగంలో నిలుస్తాడు. వైసిపి అభ్యర్థికి ఇది కొంత ప్రతికూల అంశం. అయితే నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లోనూ గతంకంటే వైసిపి బలపడడం గెలుపుపై నమ్మకాన్ని పెంచే విషయమే. నెల్లూరుజిల్లా పరిధిలోని ఒక్క సర్వేపల్లిలో మాత్రం టీడీపీ, వైసిపిల మధ్య నువ్వా-నేనా అన్నట్లుగా వుంది. వెంకటగిరి బరిలో ఆనం రామనారాయణరెడ్డి వైసిపి అభ్యర్థిగా దిగనుండడం వైసిపి ఎంపి అభ్యర్థిగా వరప్రసాద్‌కు బాగా కలిసొచ్చే అంశం. దీనికితోడు వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలలో బలమైన వర్గంగల నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి వైసిపిలో చేరడం కూడా వరప్రసాద్‌కు కలిసొచ్చిన వరమేననుకోవాలి.

సూళ్లూరుపేటలో వైసిపి గతం కంటే బలంగానే వుంది. 2014 ఎన్నికల్లో ఓడిపోయిన శ్రీకాళహస్తి, తిరుపతి అసెంబ్లీ స్థానాల్లో సైతం వైసిపి పరిస్థితి గతంకంటే మెరుగ్గావుంది. ఇవన్నీ కూడా వరప్రసాద్‌కు సానుకూల అంశాలే!




## సోమిరెడ్డికి ప్రమాదం తప్పింది



రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ నెల 14వ తేదీన శ్రీకాకుళం జిల్లాలో జరిగిన చిన్న రోడ్డు ప్రమాదం నుండి బయటపడ్డాడు. తిత్లీ తుఫాన్ సహాయక చర్యల్లో భాగంగా ఆయన శ్రీకాకుళం జిల్లాకు వెళ్ళాడు. మండల కేంద్రమైన మందసలో నారా లోకేష్ నిర్వహిస్తున్న సమీక్షా సమావేశం కోసం ఆయన కారులో బయలుదేరారు. బాలిగాం అనే గ్రామం వద్దకొచ్చేసరికి ఆయన ప్రయాణిస్తున్న కారు రెండు టైర్లు పంక్చరయ్యాయి. దీంతో కారు వంద మీటర్ల దూరం వరకు అదుపు తప్పి నడిచింది. డ్రైవర్ రాము అత్యంత నేర్పుగా వ్యవహరించి ఎటువంటి ప్రమాదం జరగకుండా చూసాడు. టీవీలలో సోమిరెడ్డి కారు ప్రమాద వార్త చూడగానే నెల్లూరు జిల్లాలో ఆయన అనుచరులు, అభిమానులు ఆందోళనకు గురయ్యారు. ఆయనకు ఎటువంటి అపాయం జరగనందుకు దేవాలయాలలో పూజలు చేశారు.

## 'యువనేస్తం'కు విస్తృత ప్రచారం కల్పించండి

'యువనేస్తం' పథకానికి విస్తృత ప్రచారం కల్పించాలని, జిల్లాలోని అర్హులంతా ఆ పథకానికి ధరఖాస్తు చేసుకునేలా చూడాలని యువజన సర్వీసుల శాఖ రాష్ట్ర డైరెక్టర్ భానుప్రకాష్ జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఈ నెల 13న ఆయన నెల్లూరుకు వచ్చి కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ ఆర్.ముత్యాలరాజును కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో యువనేస్తం పథకానికి ఎంతమంది ఎంపికయ్యారు, ఎంతమంది ధరఖాస్తు చేసుకున్నారు తదితర అంశాలను కలెక్టర్‌తో చర్చించారు. ఈ పథకంపై జిల్లాలో ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నామో ఆ వివరాలను కలెక్టర్ ఆయనకు వివరించారు.

## అథ్లెటిక్స్‌లో సర్వోదయకు పతకాలు

విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల కావలిలోని విస్డమ్ పీజీ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో నగరంలోని సర్వోదయ కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో పతకాలు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ ఏ.రాధాకృష్ణ విజేతలైన క్రీడాకారులకు ఇటీవల అభినందన కార్యక్రమం నిర్వహించారు. తమ కళాశాలకు చెందిన ఎ.చందన, ఎస్‌డి ఫిజాఖాద్రి, భవాని, ఏ.కామాక్షి, పి.అనూష, వై.ప్రశాంత్, కె.కిరణ్‌కుమార్‌లు అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనపరచి 4 బంగారు పతకాలు, 8 వెండి పతకాలు, 6 కాంశ్య పతకాలు సాధించారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సివి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## కవాతుకు వెళ్లిన నెల్లూరు సేన

ఈ నెల 15వ తేదీన రాజమండ్రిలోని ధవళేశ్వరం వంతెన వద్ద జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ నిర్వహించిన జనకవాతులో నెల్లూరుజిల్లాకు చెందిన వందలాదిమంది జనసేన కార్యకర్తలు, పవన్ అభిమానులు పాల్గొన్నారు. 14వ తేదీ రాత్రి వీరంతా నెల్లూరు రైల్వేస్టేషన్ నుండి జనసేన జిల్లా నాయకులు కొట్టె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శేషాద్రి, తిరుమల, సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు బస్సులలోనూ రాజమండ్రికి వెళ్ళారు.

## రైల్వే టైమింగ్ క్యాలెండర్లు

రైల్వే టైంటేబుల్ క్యాలెండర్ అన్నది ప్రతి ఇంట్లో వుండాల్సిన అవసరం వుంది. ఎందుకంటే ఏ ట్రైన్ ఎప్పుడొస్తుందో కనుక్కుందామని రైల్వే ఎంక్వయిరీకి ఫోన్ చేసామనుకోండి... ఆ ఫోన్‌లు పలికిచావవు కదా! నెల్లూరు జిల్లా రైల్వే యూజర్స్ అసోసియేషన్ వాళ్ళు తాజాగా నెల్లూరు రైల్వేస్టేషన్ నుండి రాకపోకలు సాగించే రైళ్ళ సమయం వివరాలతో ఓ క్యాలెండర్‌ను రూపొందించారు. ఈనెల 14వతేదీన నెల్లూరులోని అభిరామ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ జయరాజ్, చీఫ్ కమర్షియల్ సూపరింటెండెంట్ సతీష్‌లు ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఐ.లక్ష్మీనారాయణ, కె.వి.సుబ్బారెడ్డి, జి.వి.కె.బాబు, ఏ.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### ఇరుకళలమ్మకి బంగారు తాళిబొట్టు

నెల్లూరు శివారులో వెలసియున్న సింహపురి గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి ఇటీవల నెల్లూరు మూలాపేట నీలగిరి సంఘంకు చెందిన గుజ్జనపూడి శ్రీనివాసులు, లక్ష్మీ దంపతులు రూ.13 వేలు విలువ చేసే 4.130 గ్రాముల బంగారు తాళిబొట్టును బహుకరించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి తెలిపారు.

### ఉపాధి హామీలో జిల్లా ఫస్ట్

ఉపాధి హామీ పథకం అమలులో నెల్లూరుజిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానం సాధించింది. ఆ మేరకు సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు తన బంగ్లాలో ఇటీవల సంబంధిత అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బాబా మందిరంలో 100వ ఆరాధన మహోత్సవాలు

నెల్లూరు నవాబుపేటలోని రామకృష్ణా నగర్, షిరిడి సాయినగర్‌లో ఈనెల 15 నుండి బాబావారి 100వ ఆరాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. 15వ తేది ఉదయం అభిషేకాలు, పూలంగి సేవలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. 16న ఉదయం బాబా సచ్చరిత్ర సామూహిక పారాయణం, 17న ఉదయం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం వైభవంగా నిర్వహించారు. 18 న ఉదయం పంచామృత అభిషేకం, నూతన వస్త్రాలు, పూలంగిసేవ, అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు. ప్రముఖ గాయని కోలపల్లి జయశ్రీ బృందంచే భజన కార్యక్రమం జరిగింది. కార్యక్రమాలను ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నాగిశెట్టి బాబూరావు పర్యవేక్షించారు.

### అమ్మవారి భక్తులకు మజ్జిగ పంపిణీ

శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయం వద్ద ఈనెల 14న వాసవీమాత ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ రాజరాజేశ్వరి దేవాలయం ఇ.ఓ వెండిదండి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు జక్కా రమణయ్య, మునగా కృష్ణయ్య, కోశాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### బెల్టు షాపుల బెండు తీస్తాం!

బెల్టు షాపులపై దాడులు ముమ్మరం చేయాలని, వాటిని పూర్తిస్థాయిలో నియంత్రించాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటి కమీషనర్ వి.రాధయ్య ఆదేశించారు. ఇటీవల నెల్లూరులోని బీవీ నగర్‌లో ఉన్న తన కార్యాలయంలో ఆయన ఏసీ, ఈఎస్, ఏఈఎస్, ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఏడాది కాలంగా బెల్ట్‌షాపుల నియంత్రణకు తీసుకున్న చర్యలు, నిబంధనలు పాటించని దుకాణాలపై కేసుల వివరాలు, గంజాయి కేసులు, నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్, సారా విక్రయాలకు సంబంధించి ఎన్ని కేసులు నమోదు చేసారు, ఎంతమందిని అరెస్ట్ చేసారు తదితర అంశాలపై ఆయన సమీక్షించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

# మువ్వా మళ్లీ సరెండర్



*వివాదాలను చొక్కాజేబులో పెట్టుకుని తిరిగే వాళ్ళలో ఒకప్పటి జిల్లా డి.ఇ.ఓ మువ్వా రామలింగం ముందువరుసలో వుంటాడు. ఆయన ఏ పోస్ట్‌లో వున్నా వివాదం రాలేదంటే ఆశ్చర్యపోవాలి. బెల్లం వున్న చోటుకు చీమలు ఎలా వెదుక్కుంటూ వస్తాయో, రామలింగం వున్న చోటకు వివాదాలు కూడా అలానే వెదుక్కుంటూ వస్తాయి. ఎక్కడ బాధ్యతలు అప్పగించినా కుదురుగా పనిచేయడం అన్నది ఆయనకు కుదరదం లేదు.*

ప్రభుత్వానికి ఆయనను మరోసారి సరెండర్ చేశారు. కొన్ని నెలల క్రితమే పల్లిపాడులోని డైట్ ప్రిన్సిపాల్‌గా తన పరపతితో పోస్టింగ్ తెచ్చుకున్నాడు. అయితే ఆయన వాలకం తెలిసిన జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు ఆయనను ఆ పోస్ట్‌లో చేరొద్దని కోరారు. అయినా రామలింగం ఖాతరు చేయకుండా డైట్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టాడు. కాని కలెక్టర్ ఆయన జిల్లాలో వుండడానికే ఒప్పుకోలేదు. ఈ నేపథ్యంలోనే డైట్ ప్రిన్సిపాల్‌గా వున్న ఆయనను మరోసారి ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

### డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా వెంకటేశ్వర్లు

ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడులో ఉన్న ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా వెంకటేశ్వర్లు ఈనెల 13న బాధ్యతలు చేపట్టారు. వివిధ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రిన్సిపల్ మువ్వా రామలింగాన్ని జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు ప్రభుత్వానికి సరెండర్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధ్యాపకునిగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డైట్ కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించారు.

## మాతృసేవా పథకంలో.. 10 వేల ప్రసవాలు




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ ఆసుపత్రి సి.ఇ.ఓ సతీష్‌కుమార్

నెల్లూరు రూరల్ మండలం చింతారెడ్డిపాళెంలోని నారాయణ ఆసుపత్రిలో రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ తల్లి పొంగూరు సుబ్బమ్మ చేతుల మీదుగా ప్రారంభించిన మాతృసేవా పథకంలో 10వేల ప్రసవాలు ఉచితంగా చేసినట్లు ఆసుపత్రి సీఇఓ సతీష్‌కుమార్ తెలిపారు. ఇటీవల ఆసుపత్రిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2016 డిసెంబర్ 27న ప్రారంభమైన ఈ పథకం ద్వారా 21 నెలల్లో 10 వేల మందికి ప్రసవాలు చేశామన్నారు. దేశంలో 16 రాష్ట్రాలకు చెందిన మహిళలతో పాటు, 26 జిల్లాల నుంచి ఈ పథకం ద్వారా ఉచిత సేవలు పొందారని తెలిపారు. కాన్పు సమయంలో కేవలం ఫోన్ కాల్‌తో అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తీసుకొచ్చి, మళ్ళీ వారిని ఇంటి వద్దకు చేర్చేంతవరకు ఉచితమని వివరించారు. శిశువు పుట్టిన నాటినుంచి 12 ఏళ్ళ వయస్సు వచ్చే వరకూ ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. టిఫాస్కాన్ ద్వారా తల్లి గర్భంలో ఉండే శిశువుకు ఏమైనా అవయవ లోపాలు ఉన్నాయోమో అని పరీక్షలు చేసి ప్రత్యేకమైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వైద్య బృందాన్ని, నర్సింగ్, పారామెడికల్ బృందాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం భాస్కర్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ వాకర్స్ గుడ్ల పంపిణీ



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12న ప్రపంచ గుడ్డు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌వారు వాకర్స్‌కు, క్రీడాకారులకు కోడిగుడ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 'నెక్' జోనల్ మాజీ ఛైర్మెన్, ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు మాట్లాడుతూ అన్ని రకాల పోషక విలువలు, అత్యంత తక్కువ ధరలో లభించే పౌష్టికాహారం కోడిగుడ్డేనన్నారు. కోడిగుడ్లను ప్రతిఒక్కరూ ఆహారంగా తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మైథిలి మనోహర్‌రెడ్డి, కొండూరు సుబ్బారావు, జివి.కృష్ణయ్య, డి.జయరామనాయుడు, లక్కాకుల శ్రీనివాసులు, చెంచయ్యనాయుడు, జాలీ వాకర్స్ సభ్యుడు సోము పాల్గొన్నారు.



## ఆత్మకూరు 'దేశం'లో...
# ఆరని జ్వాల





ఆత్మకూరు అసెంబ్లీకి తెలుగుదేశం అభ్యర్థిగా మాజీఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్య ప్రచారంలో వున్నాడు. అద్భుతాలు జరిగితే తప్పితే అభ్యర్థి ఆయనే! చంద్రబాబే సంకేతాలిచ్చేసాడు. అయితే ఇక్కడ విచిత్రమేమిటంటే బొల్లినేని కృష్ణయ్యకు ఇంతవరకు తెలుగుదేశం పార్టీతో ఎటువంటి సంబంధాలు లేకపోవడం. ఆయన ఇంతవరకు టీడీపీ సభ్యుడు కాదు. ఆ పార్టీలో చేరనూ లేదు. కాని టీడీపీ వాళ్ళు మాత్రం టిక్కెట్ ఇచ్చారు. ఆయన తిరిగేస్తున్నాడు. బొల్లినేని కృష్ణయ్య 1999లో రాజకీయాల్లోకి వచ్చాడు. ఆ ఎన్నికల్లో ఆత్మకూరు నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచాడు. 2004లో కాంగ్రెస్‌ను వదిలి బీజేపీలోకి వెళ్ళాడు. ఆత్మకూరు నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయాడు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆనం రామనారాయణరెడ్డికి మద్దతునిచ్చాడు. ఆ తర్వాత కూడా ఆయనతో స్నేహంగా వుంటూ వచ్చాడు. 2015లో ఆనం రామనారాయణరెడ్డి తెలుగుదేశంలో చేరినప్పుడు కూడా బొల్లినేని కృష్ణయ్య అనుచరులు తెలుగుదేశంలో చేరారేగాని ఆయన అధికారికంగా ఆ పార్టీలో చేరలేదు.

బొల్లినేని కృష్ణయ్య అభ్యర్థి అన్నది వూహించని విధంగా తెరపైకి వచ్చింది. కృష్ణయ్యకు ముందు ప్రచారంలో వుండింది మాజీఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, డీసీసీబీ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, మాజీ ఇన్‌ఛార్జ్ గూటూరు కన్నబాబులు. వీరి ముగ్గురిలో ఒకరు అభ్యర్థి అవుతారని భావిస్తూ వచ్చారు. అయితే ఇటీవల బొల్లినేని స్వగ్రామమైన చేజర్ల మండలం మాముడూరులో బొల్లినేని వర్గీయులకు, మేకపాటి వర్గీయులకు వివాదం తలెత్తడం, ఈ రెండు కుటుంబాల మధ్య వున్న స్నేహసంబంధాలు తెగిపోవడం, తద్వారా బొల్లినేని కృష్ణయ్యను టీడీపీ వాళ్ళు ముగ్గులోకి దించడం చకచకా జరిగిపోయాయి.

అయితే కృష్ణయ్యను పార్టీలోకి తీసుకొచ్చి అభ్యర్థిగా ప్రచారం చేయడం వరకు బాగానేవుంది. నియోజకవర్గంలోని మిగతా పార్టీ నాయకులు ఆయనకు ఎంతవరకు సహకరిస్తారన్న సందేహాలు లేకపోలేదు. 2014 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయి ఆ తర్వాత ఇన్‌ఛార్జ్‌గా వున్న కన్నబాబును 2015లో ఆనం రామనారాయణ రెడ్డి పార్టీలో చేరాక పక్కనపెట్టారు. మొన్న రామనారాయణరెడ్డి పార్టీని వదిలిపోయాక తననే ఇన్‌ఛార్జ్‌గా పెడతారని కన్నబాబు భావించాడు. అయితే పార్టీ అనూహ్యంగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఇన్‌ఛార్జ్‌గా నియమించడంతో ఆయన జిల్లా పార్టీ ఆఫీసులోనే నానా ఆగిత్యం చేసాడు. ఇప్పుడు అభ్యర్థిగా కృష్ణయ్యను ఏకపక్షంగా నియమించడం కూడా ఆయనకు మింగుడుపడడం లేదు. వచ్చే ఎన్నికల్లో కన్నబాబు కృష్ణయ్యకు పని చేస్తాడా?

ఇక డీసీసీబీ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి కూడా ఆత్మకూరు సీటును ఆశించాడు. ఆదాల ప్రభాకర్ రెడ్డి ఎంపి అభ్యర్థి అయితే ఆత్మకూరు సీటు తనదేననుకున్నాడు. 2009, 2014 ఎన్నికల్లో ఆత్మకూరు కాంగ్రెస్ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తరపున ఎలక్షన్ చేసింది ఆయనే! నియోజకవర్గంలో బంధుగణం, అనుచరవర్గం వుంది. మరి పార్టీ నిర్ణయించిన అభ్యర్థి బొల్లినేని కృష్ణయ్యతో ఆయన ఎంతవరకు సర్దుకుపోతాడనే అనుమానాలున్నాయి.

అన్నింటికి మించి కొమ్మి లక్ష్మయ్యనాయుడు... తెలుగుదేశం వాళ్ళే ఆయనకు ఇటీవల లేనిపోని ఆశలు పెట్టి ఉసూరుమనిపించారు. కొమ్మి లక్ష్మయ్య, బొల్లినేని కృష్ణయ్య నిప్పు-ఉప్పు లాగా వుంటారు. అసలు బొల్లినేని కృష్ణయ్య రాజకీయాలలోకి దిగిందే కొమ్మి లక్ష్మయ్యను దెబ్బకొట్టడం కోసం. అలాంటి శత్రుత్వం వున్న వీళ్ళిద్దరూ ఒకే ఒరలో ఇముడుతారా? గత వైరాన్ని మరచి కృష్ణయ్యకు లక్ష్మయ్య సహకరిస్తాడా?

మొత్తానికి ఆత్మకూరు తెలుగుదేశంలో అసంతృప్తి జ్వాల రగిలివుంది. దీనిని కృష్ణయ్య ఎంతవరకు ఆర్పుకోగలడన్నదానిపైనే ఆయన భవిష్యత్ ఆధారపడి వుంటుంది.

# 'రిజర్వ్' అభ్యర్థుల కొరత

## గూడూరులో వైసిపికి... సూళ్ళూరుపేటలో టీడీపీకి









***జిల్లాలో రెండు ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాలున్నాయి. ఒకటి సూళ్లూరుపేట, రెండోది గూడూరు. గతంలో అటు కాంగ్రెస్‌కు, ఇటు టీడీపీకి ఈ రెండు చోట్ల కూడా శాశ్వత అభ్యర్థులుండేవాళ్ళు. చాలా ఎన్నికల వరకు గూడూరులో టీడీపీకి బల్లి దుర్గాప్రసాద్, కాంగ్రెస్‌కు పట్రా ప్రకాశరావు, సూళ్ళూరుపేటలో టీడీపీకి పరసా రత్నం, కాంగ్రెస్‌కు పసల పెంచలయ్య అభ్యర్థులుగా వుంటూవచ్చారు. తర్వాత కాలంలో మారిన రాజకీయ పరిస్థితులను బట్టి పార్టీలు వాళ్ళను మారుస్తూవచ్చాయి.***

2014 ఎన్నికల్లో ఈ రెండు రిజర్వుడ్ నియోజకవర్గాలు వైసిపి ఖాతాలో చేరాయి. గూడూరు నుండి పాశం సునీల్‌కుమార్, సూళ్ళూరుపేట నుండి కిలివేటి సంజీవయ్యలు వైసిపి అభ్యర్థులుగా గెలుపొందారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆ పార్టీలోకి వెళ్లిపోవడం జరిగింది. సునీల్ వైసిపిలోనే వుంటే వచ్చే ఎన్నికల్లోనూ వైసిపి అభ్యర్థి అతనే! సునీల్ పార్టీ మారడంతో వైసిపికి ఇక్కడ అభ్యర్థి వెదుకులాట తప్పడం లేదు. మేరిగ మురళి గూడూరు వైసిపి ఇన్‌ఛార్జ్‌గా వున్నారు. గూడూరు సీటును ఆయన ఆశిస్తున్నాడు. మేకపాటి ఆశీస్సులు కూడా మెండుగా వున్నాయి. కాకపోతే అసెంబ్లీకి అతను సరిపోడనే అభిప్రాయం పార్టీ కేడర్‌లోనే వ్యక్తమవుతోంది. అలాగే బత్తిని విజయకుమార్ కూడా టిక్కెట్ రేస్‌లో వున్నాడు. 2014 ఎన్నికల్లో ఆయన టిక్కెట్‌ను ఆశించాడు గాని, అది సఫలం కాలేదు. ఇక కాంగ్రెస్‌లో వున్న పనబాక కృష్ణయ్య అయితే గూడూరు వైసిపికి సరైన అభ్యర్థి అనే అభిప్రాయం వుంది. అయితే ఆయనను వైసిపిలోకి తీసుకురావాలని చేసిన ప్రయత్నాలు కొన్ని కండీషన్‌ల వల్ల ఫలించలేదు. వీరివైపు నుండే కాకుండా మహిళల వైపు నుండి కూడా అభ్యర్థిని ఆలోచిస్తున్నారు. మహిళా అభ్యర్థి అయితే జిల్లాలో ఒక మహిళకు సీటిచ్చినట్లుగా కూడా వుంటుందని ఆ దిశగా ఆలోచిస్తున్నారు.

సూళ్లూరుపేటలో టీడీపీకి ఈసారి అభ్యర్థి ఎవరుంటారన్న ప్రశ్న వస్తోంది. 1994 ఎన్నికల నుండి కూడా వరుసగా ఐదుసార్లు పరసా రత్నం ఇక్కడ టీడీపీ అభ్యర్థిగా నిలబడ్డాడు. మూడుసార్లు విజయం సాధించాడు. 2014లో ఓడిపోవడం తెలిసిందే! ఈసారి పరసారత్నంను నియోజవర్గంలో బలమైన వేనాటి వర్గం వ్యతిరేకిస్తోంది. పరసా రత్నంను కాదనుకుంటే ఇక్కడ టీడీపీకి కొత్త అభ్యర్థిని వెదకాల్సి వుంటుంది.

## జిల్లాలో...
# కరువు తాండవిస్తోంది

- పరిస్థితిని సమీక్షించి బాధితులను ఆదుకోండి
- కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శికి ఎంపి విపిఆర్ వినతి



జిల్లాలో కరువు తాండవిస్తోందని, వర్షాభావంతో భూగర్భజలాలు అడుగంటిపోయి ప్రజలు తాగునీటికి, రైతులు సాగునీటికి ఎన్నో అవస్తలు పడుతున్నారని, వెంటనే కేంద్రబృందాన్ని జిల్లాకు పంపి జిల్లాలోని కరువు పరిస్థితులను సమీక్షించి బాధితులను ఆదుకోవాలని రాజ్యసభసభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి సంజయ్ అగర్వాల్‌ను కోరారు. ఇటీవల విపిఆర్ ఢిల్లీలో సంజయ్ అగర్వాల్‌ను కలసి జిల్లా పరిస్థితిని వివరించారు. జిల్లాలో సక్రమంగా వానలు కురవకపోవడం వల్ల సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతోందని, 2016-17లో కురవాల్సిన సాధారణ వర్షపాతం 64శాతం తక్కువ నమోదైందని, 2017-18లో 24శాతం తక్కువగా, 2018లో ఇప్పటిదాకా 48శాతం తక్కువ వర్షపాతం నమోదైందని వివరించారు. జిల్లాలోని మొత్తం 46మండలాల్లో కరువు ఏర్పడిందని, రాష్ట్ర ప్రభుత్వం జిల్లాను కరువుజిల్లాగా ప్రకటించిందని తెలిపారు. అంతేకాక, ప్రధాని పసల్ బీమా యోజన పథకం లబ్దిదారులందరికీ చేరువయ్యేలా మార్గదర్శకాలు మార్చాల్సి ఉందని, రైతులకు కనీసం 25శాతం పరిహారం అందేలా నిబంధనలను రూపొందించాలని సూచించారు. జిల్లాలోని కరువు పరిస్థితులను విపిఆర్ వివరించగా, అందుకు స్పందించిన సంజయ్ అగర్వాల్ వీలైనంత త్వరలో కేంద్ర బృందాన్ని జిల్లాకు పంపించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# అభివృద్ధికే ఓటెయ్యండి

## - ఆమంచర్లలో మాజీమంత్రి ఆదాల



ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకానికి శంకుస్థాపన చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

మీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసినవారికే ఓటెయ్యండి.. అంటూ టిడిపి నాయకుడు, మాజీమంత్రి ఆదాల ప్రజలకు పిలుపునిచ్చారు. నెల్లూరు రూరల్ మండలంలోని ఆమంచర్ల గ్రామంలో ఇటీవల ఎన్టీఆర్ గృహనిర్మాణం పథకానికి ఆదాల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆమంచర్లలో త్వరలో భూగర్భ డ్రైనేజీ పథకం పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ పనులకు ప్రభుత్వం 5 కోట్ల రూపాయలు మంజూరు చేసిందన్నారు. ఈ మండలంలో సిమెంట్‌రోడ్డు లేని వీధి లేదంటే అతిశయోక్తి కాదని, తెలుగుదేశం ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని ఎంతగానో అభివృద్ధి చేసిందని ఆయన వివరించారు. ఆమంచర్లలో 400 పక్కాఇళ్ళను కూడా మంజూరు చేశామన్నారు. ఈ ఇళ్ళ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే, ఎంపీ ప్రజలకు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తూ, నిధులున్నా ఖర్చుపెట్టని పరిస్థితి ఇక్కడ ఉందని ఆయన విమర్శించారు. వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఛైర్మెన్ మలినేని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, టిడిపి నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, హరిబాబుయాదవ్, మాతంగి కృష్ణ, జెన్ని రమణయ్య, స్వర్ణా వెంకయ్య, పాశం శ్రీనివాసులు, పాముల హరి, మధురెడ్డి, రజనీ, నరసింహారావుతో పాటు స్థానిక నాయకులు నారయ్య, రఘురామయ్య, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో ఉన్నత శిఖరాలు

## రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాశం సునీల్




## గూడూరు డివిజన్ వార్తలు

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించడం ఎంతో అభినందనీయమని, క్రీడల్లో ప్రతిభ చూపుతూ ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరులోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 64వ రాష్ట్ర స్థాయి సిఎం కప్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ఈనెల 13న గూడూరు పురపాలకసంఘం అధ్యక్షురాలు పొణకా దేవసేన, డిప్యూటి డిఇఓ యజ్దానీ అహ్మద్‌లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు గూడూరులో నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రభుత్వం క్రీడారంగాన్ని ఎంతగానో ప్రోత్సహిస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకించి క్రీడా రంగానికి ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగి విజయాలు సొంతం చేసుకోవాలన్నారు. ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు రావడంతో గూడూరులో సందడి నెలకొందన్నారు. అనంతరం క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు చేవూరు విజయమోహన్‌రెడ్డి, డిఎస్పీ రాంబాబు, రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటరావు, మహబూబ్‌బాషా, జడ్పీటిసి సభ్యురాలు పద్మజ, మండల ఉపాధ్యక్షురాలు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు దైవంతో సమానం

----------------------------------- డిఎస్పీ రాంబాబు




వృద్ధులకు ఫలసరుకులు అందజేస్తున్న డిఎస్పీ రాంబాబు, జేవివి ప్రతినిధులు

తల్లిదండ్రులు దైవంతో సమానమని, వారిని దైవంతో సమానంగా చూసుకున్నప్పుడే జన్మకు సార్ధకత లభిస్తుందని గూడూరు డిఎస్పీ రాంబాబు అన్నారు. గూడూరులోని సాయిరాం వృద్ధాశ్రమంలో ఈనెల 13న జేవివి ఆధ్వర్యంలో వేణుగోపాల్, సనత్‌కుమార్, భాస్కర్‌ల దాతృత్వంతో వృద్ధులకు ఫలసరుకులు, పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ రాంబాబు మాట్లాడుతూ వృద్ధులకు చేయూతనివ్వడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా వారికి ఫలసరుకులు అందించేలా కృషి చేస్తున్న జేవివి సభ్యులను ఆయన అభినందించారు. వృద్ధులకు వైద్యపరీక్షలు చేయించే బాధ్యతను కూడా జేవివి సభ్యులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేవివి ప్రతినిధులు మనపాటి రవీంద్రబాబు, రాజేంద్రప్రసాద్, నాగరాజు, పురుషోత్తమరావు, మహీధర్, మనోహర్, అశోక్, విష్ణు, చెంచు నారాయణ, బాబు, రామ్మోహన్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు ఫలసరుకులు




గూడూరు రోటరీ భవన్‌లో ఇటీవల జరిగిన సమావేశంలో వృద్ధులకు పలసరుకులు పంపిణీ చేసి దాతలు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. పేర్నాటి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, వైఎస్సార్పీ నాయకుడు పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, రోటరీక్లబ్ అధ్యక్షుడు పి.హరి ప్రసాద్, బాలకృష్ణమరాజు, కె. మునిగిరీష్, దశరథరామిరెడ్డి, పి.రామకృష్ణారెడ్డి, జానకిరామిరెడ్డి, మయూరి శ్యాంయాదవ్, కె.సుందరరామిరెడ్డి, దయాకర్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ముగిసిన సహకార బ్యాంక్ ఉద్యోగుల శిక్షణ




సమావేశంలో మాట్లాడుతున్న మెట్టుకూరు ధనుంజయరెడ్డి

నెల్లూరులోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌ను మరింత పటిష్టం చేయడానికి నాబార్డ్, నాబ్కాన్స్ సంస్థల ఆధ్వర్యంలో బ్యాంక్ ఉద్యోగులకు 'ఆర్గనైజేషన్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్' కార్యక్రమాన్ని ఇటీవల బ్యాంకు ఆవరణంలో నిర్వహించారు. ఆ మేరకు బ్యాంక్ ఉద్యోగులకు ఈనెల 8 నుంచి ప్రారంభమైన శిక్షణా తరగతులు ఈనెల 13వ తేదీతో ముగిశాయి. ఈ సందర్భంగా బ్యాంక్ అధ్యక్షుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ, బ్యాంక్ ఉద్యోగులు ఈ శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను వారి బ్రాంచ్‌లలో అమలుచేసి బ్యాంక్ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. అనంతరం, జిల్లాలోనే తొలిసారిగా ఈ బ్యాంక్‌కు సంబంధించిన మొబైల్ ఏటిఎం సేవలను అందరి హర్షధ్వానాల మధ్య ప్రారంభించారు. జిల్లావాసులు ఈ మొబైల్ ఏటిఎం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం బి.రమేశ్‌బాబు, నాబ్కాన్స్ రిసోర్స్ పర్సన్‌లు జి.నాగభూషణం, ఏ.లక్ష్మీనరసయ్య, బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.వి రమణారెడ్డి, బ్యాంక్ డైరెక్టర్లతో పాటు డిజిఎంలు శ్రీమతి వై.సరిత, ఎన్.ఉషారాణి, ఎన్‌వి నాగేంద్ర కుమారి తదితరులు పాల్గొన్నారు.

## గీతాంజలిలో..

# గేమ్స్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్




కోవూరు మండలం, గంగవరంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఈనెల 13 నుంచి 15వతేది వరకు మూడురోజుల వర్క్ షాప్ జరిగింది. గేమ్స్ డెవలప్‌మెంట్ టెక్నాలజీపై జరిగిన ఈ వర్క్‌షాప్ టెక్నాలజీపై విద్యార్థుల అవగాహనకు ఎంతో తోడ్పడింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.సుబ్బారావు మాట్లాడుతూ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సౌజన్యంతో ఈ వర్క్‌షాప్‌ను తృతీయ సంవత్సరం ఇసిఇ చదువుతున్న విద్యార్థుల కోసం నిర్వహించామని, విద్యార్థుల సృజనాత్మక ప్రతిభను పెంపొందించేందుకు, మొబైల్ గేమ్స్, కంప్యూటర్ గేమ్స్ వగైరాలను అభివృద్ధి చేయడానికి, కంప్యూటర్స్ రంగంలో నూతన ఆవిష్కరణలు రూపొందించడానికి ఈ వర్క్‌షాప్ దోహదం చేస్తుందన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు ఫణీంద్రబాబు, ఇర్ఫాన్, ఇసిఇ విభాగాధిపతి సి.రాఘవరెడ్డి, పారిశ్రామిక సంబంధాల విభాగాధిపతి పి.చక్రపాణి, కార్యక్రమ సమన్వయకర్త కె.ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్‌లో జాతీయస్థాయి టెక్నో క్వెస్ట్

కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈ నెల 13న జాతీయస్థాయి (సాంకేతిక పత్రాలు మరియు గోడపత్రిక పోటీ సదస్సు) టెక్నో క్వెస్ట్-2018 జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెంగుళూరులోని ప్రముఖ టెలికామ్ ప్రాడెక్ట్ డెవలప్‌మెంట్ కంపెనీ తేజాస్ నెట్‌వర్క్‌లో హ్యూమన్ రిసోర్స్ విభాగానికి అధిపతి అయిన ఎస్‌పి పూర్ణిమ విచ్చేశారు. కళాశాల సంచాలకులు డా.వి. విజయకుమార్‌రెడ్డి మరియు కార్యక్రమ సమన్వయకర్త డా.పి.నందకుమార్ పాల్గొని జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పూర్ణిమ మాట్లాడుతూ, విద్యార్థులు సృజనాత్మ కంగా, విభిన్నంగా ఆలోచించి సమాజానికి ఉపయోపడేట్లుగా కొత్తకొత్త ఆవిష్కరణలకు రూపకల్పన చేయాలని సూచించారు. ఈ పోటీ ప్రపంచంలో నిలబడాలంటే విషయ పరిజ్ఞానంతో పాటు, ఆత్మస్థైర్యం, దృఢసంకల్పం, కృషి-పట్టుదల కలిగివుండాలని, అందరిపట్ల సత్సంబంధాలు కొనసాగించాలని పేర్కొన్నారు.

కార్యక్రమ సమన్వయకర్త డా.పి.నందకుమార్ మాట్లాడుతూ, ఈ పోటీ సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా 300కు పైగా సాంకేతిక పత్రాలు మరియు 50కి పైగా గోడపత్రికలు వచ్చాయని, అన్నిటినీ పరిశీలించి ఉత్తమమైన వాటిని ఎంపిక చేస్తామన్నారు. కళాశాల సంచాలకులు




డా.వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని, వీటి నిర్వహణలో ఎన్‌బికెఆర్ ఎల్లప్పుడూ ముందువరుసలో ఉంటుందని అన్నారు. ఈ ఎంపికలో విజేతలుగా ఉత్తమంగా ఎంపికైనవారికి బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా ఆయా విభాగాల నిపుణులు ఎం.మునిసుందరం, రామకృష్ణరాజు, డా.పి. రామ్మోహన్‌రావు వ్యవహరించారు. ఇసిఇ విభాగాధిపతి డా.జి.హరినాథ్‌రెడ్డి, సివిల్ విభాగాధిపతి డా.డి.శ్రీనివాసన్, ఇఇఇ విభాగాధిపతి డా.ఎస్.సురేష్ రెడ్డి, సిఎస్ఇ విభాగాధిపతి డా.ఎస్. మారుతీ పెరుమాళ్‌తో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు
గూడూరు శాసనసభ్యులు
శ్రీ పాశం సునీల్‌కుమార్ గారికి
విజయదశమి మరియు
దీపావళి శుభాకాంక్షలు.

మీ...
వీరిబోయిన గోపాలకృష్ణ యాదవ్
ధర్మరాజుస్వామి ట్రస్టుబోర్డు మాజీచైర్మెన్, టీడీపీ నాయకులు, గూడూరు టౌన్.

# చంద్రబాబును క్షమాపణ కోరిన కేసీఆర్

శ్రీను గల్పిక

*జరిగిన కథ : తెలంగాణ ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబును కేసీఆర్ 'ఘూ నీ బ్రతుకుచెడ' అని తిడతాడు. మీడియాలో ఆ తిట్టు బాగా హైలెట్ అవుతుంది. చంద్రబాబు పడుకున్నా గాని చెవిలో 'ఘూ నీ బ్రతుకు చెడ' అనే డైలాగే రిపీట్ అవుతుంటుంది. కేసీఆర్ అన్న డైలాగ్ ప్రపంచవ్యాప్తంగా తెలిసిపోతుంది. పక్కరోజు ఐక్యరాజ్య సమితి ప్రధానకార్యదర్శి, సింగపూర్ ప్రధాని, ట్రంప్, బిల్‌క్లింటన్, బిల్‌గేట్స్, పుతిన్‌లు చంద్రబాబుకు ఫోన్‌లు చేసి కేసీఆర్ తిట్టిన తిట్లపై పరామర్శిస్తారు. రాష్ట్ర మంత్రులు, ఎంపీలు కూడా ఉండవల్లిలోని ఆయన నివాసానికి విచ్చేసి వుంటారు. 'ఘూ నీ బ్రతుకు చెడ' అన్న కేసీఆర్ డైలాగ్‌పై అంత రాద్ధాంతం జరుగుతుండే సరికి చంద్రబాబు ఆవేశంతో ఆ కేసీఆర్‌కు బుద్ధి చెప్పేవారే లేరా? అని అరుస్తాడు. అప్పడే అక్కడకు యువరత్న నందమూరి బాలకృష్ణ, నవరత్న నారా లోకేష్ ఎంట్రీ ఇస్తారు.*

*ఆ తర్వాత...*

ఎప్పుడూ పున్నమి చంద్రుడిలా వుండే తన తండ్రి ముఖం ఆరోజు అమావాస్య చంద్రుడిలా వుండడాన్ని నారా లోకేష్ గమనించాడు. తండ్రితో ఆయన... ఏమైంది నాన్నారు, అలా వున్నారు. ఆ రిపబ్లిక్ టీవీ సర్వే చూసి గాని నిజమనుకుంటున్నారా? సర్వేలో చెప్పినట్లు వైసిపికి 21 లోక్‌సభ స్థానాలు, మనకు 4స్థానాలు వస్తాయనుకుంటున్నారా? ఆ సర్వేలను నమ్మాల్సింది మనం కాదు. జగన్. ఆ సర్వేను ఆయన గట్టిగా నమ్మితేనే మనం 2014 ఎన్నికల్లో లాగా మళ్ళీ గెలవగలం. నమ్మకుండా తన పని తాను చేసుకున్నాడో మనకు అగచాట్లే అని చెప్పాడు. అప్పుడు ఎంపీ శివప్రసాద్ కలగజేసుకుని... మీ నాన్నారు బాధ పడుతున్నది అందుకు కాదు బాబు... ఆ కేసీఆర్ మీ నాన్నగారిని చాలా ఘోరంగా తిట్టాడు అని చెప్పాడు. అందుకు లోకేష్... ఏం తిట్టాడు... వరదల్లో వాటర్ అమ్ముకునే ఫేసు అని తిట్టాడా... శీతాకాలంలో మట్టి కుండలమ్ముకునే వాళ్ళన్నాడా... ఎండాకాలంలో హీటర్లు అమ్ముకునేవాళ్ళమని తిట్టాడా... ఏమని తిట్టాడు అని లోకేష్ గద్దించి అడిగాడు. అప్పుడు మురళీమోహన్ వుండి... మీ నాన్నోరిని ఆయన అన్ని మాటలు అనలేదు బాబూ... నువ్వు కొత్త డైలాగ్‌లు సృష్టించమాకు... ఆ కేసీఆర్ అన్న డైలాగ్‌తోనే మీ నాన్నగారు కోలుకోలేకున్నారు అని అన్నాడు. అసలు కేసీఆర్ ఏమన్నాడో చెప్పండి టెన్షన్ పెట్టకుండా అని కోపంగా అడిగాడు. 'ఘూ నీ బ్రతుకు చెడ' అని మీ నాన్నగారిని తిట్టాడు బాబు అని శివప్రసాద్ చెప్పాడు. ఆ మాట వినగానే లోకేష్‌లో ఆవేశం పెరిగింది. ఆ కేసీఆర్ అంతు చూస్తా... మా నాన్న కాలిగోటికి కూడా పనికిరాడు, మా నాన్ననే అంత మాటంటాడా అని అరవసాగాడు. కూల్ బాబూ కూల్ అని మురళీమోహన్ అన్నాడు. నేను కూల్ కావాలంటే ఒక లస్సీ చెప్పండి అని లోకేష్ చెప్పాడు. అంతలో అక్కడకు సింహపురి చాణక్య సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వచ్చాడు. పరిస్థితిని గమనించి ఏమైందని పత్తిపాటి పుల్లారావును అడిగాడు. జరిగిందంతా పుల్లారావు చెప్పాడు. అప్పుడు చంద్రబాబుతో సోమిరెడ్డి... ఆ కేసీఆర్‌కు బుద్ధి చెప్పే అణ్వాయుధాలు మన దగ్గరే వున్నాయి సార్, వాటిని ప్రయోగిద్దామన్నాడు. చంద్రబాబు ఉలిక్కిపడి... అణ్వాయుధాలా... ఈ మాట వింటే ఆ ట్రంప్ మన మీద బాంబులేసిపోతాడు. గట్టిగా అనకు మీడియా వింటుంది. నువ్వు చెప్పేదేదో క్లారిటీగా చెప్పు అని అన్నాడు. అందుకు సోమిరెడ్డి... మన లోకేష్, బాలకృష్ణలు అణ్వాయుధాలతో సమానం సార్. ఒకరు పృథ్వి క్షిపణి అయితే ఇంకొకరు అగ్ని క్షిపణి... ఆ కేసీఆర్‌ను ధ్వంసం చేసి వస్తారు. తెలంగాణలో ప్రచారానికి ఆ రెండు క్షిపణులను వదలండి అని చెప్పాడు. నాకైతే నమ్మకం లేదని చంద్రబాబు అన్నాడు. నాకైతే నమ్మకం వుంది సార్, ముందు మీరు ఆ రెండు క్షిపణులను తెలంగాణ మీదకు వదలండి అని సోమిరెడ్డి ధైర్యంగా చెప్పాడు.

★★★★★

కరెక్ట్‌గా వారంరోజుల తర్వాత...

ఉండవల్లిలోని తన ఇంట్లో చంద్రబాబు నిద్రలేచి హాల్‌లో కొచ్చాడు. తన కంటే ముందే నిద్రలేచి టీవీ చూస్తున్న దేవాన్ష్‌ను ఒడిలో కూర్చోబెట్టుకుని ముచ్చట్లాడసాగాడు. ఆయన మనుమడితో కాలక్షేపంలో వుండగా "నన్ను క్షమించండి దొర" అనే మాటలు వినిపించాయి. కింద చూస్తే కేసీఆర్ తాను కూర్చుని వున్న సోఫా కాళ్ళు పట్టుకుని ఏడుస్తున్నాడు. కేసీఆర్... అవి నా కాళ్ళు కాదు, సోఫా కాళ్ళు అని చెప్పాడు. ఏవైనా కాళ్ళే కదా... మీ కాళ్ళు పట్టుకోలేకే వాటి కాళ్ళు పట్టుకున్నాను, ఏదో బుద్ధి గడ్డి తిని మీపై మాట తూలాను, నోటికొచ్చినట్లు తిట్టాను. నన్ను మన్నించండి, ఇంకెప్పుడూ తప్పుగా మాట్లాడను. ముందు ఆ లోకేష్‌ను, బాలకృష్ణలను వెనక్కు పిలిపించండి అని ప్రాధేయపడ్డాడు. చంద్రబాబు అతనిని లేవదీసి అలాగే పిలిపిస్తాలే అని హామీ ఇచ్చాడు. చంద్రబాబు హామీతో కేసీఆర్ ఊపిరి పీల్చుకుని వెళ్ళిపోయాడు. కేసీఆర్ వచ్చి క్షమాపణ కోరడంతో చంద్రబాబుకు ఏమీ అర్థం కాలేదు. తెలంగాణలో లోకేష్, బాలకృష్ణలు ఏం చేసారో తెలుసుకోవాలని ఆయన మనసు ఆతృత చెందసాగింది. అంతలో అక్కడకు సోమిరెడ్డి వచ్చాడు. చంద్రబాబు ఆయనతో కేసీఆర్ వచ్చి క్షమాపణలు కోరిన విషయం చెప్పి అసలు అక్కడ ఏం జరిగివుంటుందని అడిగాడు. అప్పుడు సోమిరెడ్డి చేతివేళ్ళతో ఎయిర్ స్క్రీన్ గీసి సీన్‌లు ప్లే చేసాడు.

★★★★★

హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో తెలుగుదేశంపార్టీ బహిరంగ సభ... లోకేష్ మాట్లాడుతున్నాడు. అన్నలారా, తమ్ముల్లారా, ఈ దేశంలో కులపిచ్చి మతపిచ్చి అత్యంత అవినీతి పార్టీ ఏదైనా వుందంటే అది తెలుగుదేశమే... సైకిల్ గుర్తుకు ఓటేస్తే మీ ఉరి మీరు బిగించుకున్నట్లే అని చెప్పాడు. లోకేష్ ప్రసంగానికి సభకు వచ్చిన జనాలందరూ ఆశ్చర్యపోయారు.

★★★★★

అది అదిలాబాద్‌జిల్లా బెల్లంపల్లి... యువరత్న బాలకృష్ణ రోడ్‌షో జరుగుతోంది. ఎండ ఎక్కువుగా వుండడంతో ఆయన చొక్కా విప్పేసి రోడ్‌షోలో పాల్గొన్నాడు. తనపైకి పూలదండలు విసిరిన ఇద్దరిని మధ్యలో కొట్టాడు కూడా! తర్వాత ఒక జంక్షన్‌లో బహిరంగ సభ... బాలకృష్ణ హిందీ, ఇంగ్లీష్, చైనీస్, మిల్లీ, జపనీ, లాటిన్, అరబిక్, ఉర్దూ భాషలను మిక్స్ చేసి కేసీఆర్‌పై తిట్ల దండకం మొదలుపెట్టాడు. అన్ని రకాల భాషలు వింటుండేసరికి జనాలు హుషారుగా చప్పట్లు కొట్టసాగారు.

ఎయిర్ స్క్రీన్‌పై ఈ రెండు సీన్‌లు చూసాక చంద్రబాబు... మా పుత్రరత్నం లోకేష్ మన పార్టీనే విమర్శించి సైకిల్ గుర్తుకు ఓటేస్తే ఉరేసుకున్నట్లేనని చెప్పాడుగా... అలాగే బాలయ్య అన్ని భాషలు మిక్స్ చేసి కేసీఆర్‌ను తిట్టాడు... దీనికి, కేసీఆర్ నన్ను క్షమాపణ కోరడానికి సంబంధమేంటని అడిగాడు. అందుకు సోమిరెడ్డి... లోకేష్ సొంత పార్టీనే తిట్టడంపై తెలంగాణ ప్రజల్లో అనుమానమొచ్చింది. సొంత పార్టీనే తిట్టిన నాయకుడిని ప్రజలు ఇంతవరకు చూడలేదు. లోకేష్ నిజాయితీ అక్కడి ప్రజలకు నచ్చి... మాకు మీ నాయకత్వమే కావాలని ఆయనకు బ్రహ్మరథం పట్టసాగారు. అలాగే బాలయ్య ఆల్ లాంగ్వేజీ తిట్లు తెలంగాణ ప్రజలను బాగా ఆకట్టుకోసాగాయి. ఇంకో వారం ఆయన తెలంగాణలో తిరిగితే కేసీఆర్ ఆయన ముందు ఎందుకూ పనికిరాడు. వీళ్ళిద్దరూ తెలంగాణలో వుంటే తన ఇమేజ్ డామేజీ అవుతుందనే కేసీఆర్ మీ వద్దకు కాళ్ళ బేరానికి వచ్చాడని చెప్పాడు. దాంతో చంద్రబాబులో పుత్రోత్సాహం తన్ను కొచ్చినట్లు కనిపించి... మనసులోనే 'ఐ లవ్‌యు మై సన్' అనుకున్నాడు.

**(అయిపోయింది)**

## ఉచిత బ్యూటీషియన్ కోర్సు



\- వసంతలక్ష్మి

వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ గత రెండు దశాబ్దాలుగా మహిళలు, పిల్లలు, వృద్ధులు, వికలాంగులను అక్కున చేర్చుకుని వారి జీవితాలలో కొత్త ఆశల కిరణాలను అందిస్తున్నదని ట్రస్ట్ చైర్‌పర్సన్ వసంతలక్ష్మి తెలిపారు. ఈనెల 15న నెల్లూరు పొగతోటలోని తన ఛాంబర్లో ఏర్పాటు చేసిన విలకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్, వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో పేద మహిళల స్వావలం బన కోసం బ్యూటీషియన్ కోర్సులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కోర్సును ఆధునికతతో, అత్యున్నత ప్రమాణాలతో ఉచితంగా అందించబడుతుందన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, 18 నుండి 35 సంవత్సరాలు లోపల వయస్సు కలిగిన మహిళలు నెల్లూరు బివి నగర్‌లోని వసంతలక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 3 నెలలు ఉచితంగా బ్యూటీషియన్ కోర్స్ శిక్షణ ఇచ్చి పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి 100శాతం ఉపాధి కల్పించబడుతుందన్నారు. ఉత్తీర్ణులైన వారికి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారి సర్టిఫికెట్ అందజేయబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుపేద మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9393979749, 9603087165 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## నారాయణలో టెక్నికల్ సింపోజియం

నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 13న జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం నిర్వహించారు. మీనాక్షి పవర్‌ప్లాంట్ ఉపాధ్యక్షుడు చిన్నిరామ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నా యన్నారు. పెరిగిపోతున్న విద్యుత్ డిమాండ్‌ను అధిగమించాలంటే సౌరవిద్యుత్, పవన విద్యుత్‌పై దృష్టి సారించాలన్నారు. మీనాక్షి పవర్‌ప్లాంట్ అడిషనల్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.జనార్ధనరావు, సంజీవయ్య పవర్ ప్లాంట్ ఎస్ఇ జె.రమేష్‌మున్ని, కళాశాల రిజిస్ట్రార్ ఆర్.సాంబశివరావు, డైరెక్టర్ ఏవిఎస్ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి, డా.జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో త్వరలో డిజిటల్ లైబ్రరీ

- **3 కోట్ల వ్యయంతో ఏర్పాటుకు సిద్ధం**
- **రాష్ట్ర గ్రంథాలయసంస్థ చైర్మెన్ వెల్లడి**

దేశంలో ఎక్కడా లేనివిధంగా నెల్లూరు జిల్లాలో 3 కోట్ల రూపాయలు వెచ్చించి డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ దాసరి రాజారావు తెలిపారు. ఇటీవల ఆయన నెల్లూరు, రేబాలవారివీధిలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆడిటోరియంలో జరిగిన గ్రంథాలయ శాఖాధికారుల సమావేశంలో మాట్లాడారు. ఈ డిజిటల్ లైబ్రరీని జిల్లాలో ఏదో ఒక పంచాయతీలో త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ఏడు నెలల్లో లైబ్రరీ నిర్మాణం జరగాలని పిపిఐడబ్ల్యుఐడిసి నెల్లూరు సబ్‌డివిజన్ డి.ఇ శ్యాంసన్‌కు తొలివిడతగా 50లక్షల రూపాయల చెక్కును అందజేశారు. గతంలో ఉన్న ప్రభుత్వం గ్రంథాలయ సంస్థను నిర్వీర్యం చేసిందని, టిడిపి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో గ్రంథాలయాలకు మహర్దశ వచ్చిందని తెలిపారు. గ్రంథాలయ ఉద్యోగుల జీత భత్యాల కోసం 140 కోట్ల రూపాయలను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించారని, త్వరలో గ్రంథాలయశాఖలో ఖాళీగా ఉన్న పోస్టును భర్తీ చేసే విషయాన్ని కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. గ్రంథాలయాలు చారిత్రక అవసరాలని, వాటి పరిరక్షణకు ప్రభుత్వం, ప్రజలు కంకణ బద్ధులు కావాలని ఆయన కోరారు. స్థానిక సంస్థల నుంచి రాష్ట్రవ్యాప్తంగా 343 కోట్ల రూపాయల బకాయిలు రావాల్సి ఉందని, జిల్లాలో కూడా 23కోట్ల రూపాయల బకాయిలు రావాలని, స్థానిక సంస్థల నుంచి ఆ బకాయిలు వస్తే గ్రంథాలయాల్లో మౌలిక వసతులను మెరుగుపరచుకోవచ్చునని ఆయన అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు కిలారి వెంకటస్వామి నాయుడు మాట్లాడుతూ నెల్లూరు రంగనాయకులపేటలో శిథిలావస్థలో ఉన్న ఉన్న గ్రంథాలయాన్ని 2.10 లక్షలతో బాగు చేయించామని, త్వరలో నవాబుపేటలోని గ్రంథాలయాన్ని కూడా పాతిక లక్షల ఖర్చుతో ఆధునీకరిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ, జిల్లాలో లైబ్రరీ నిర్మాణాలకు స్థిరాస్తుల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అనంతరం దాసరి రాజారావును గ్రంథాలయ ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నుడా శీనయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్లు, కార్యదర్శి, గ్రంథాలయ అధికారులు పాల్గొన్నారు.

## బోగస్ కుల ధృవీకరణలపై విచారణ జరపాలి

జిల్లాలో బోగస్ ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలతో ఉద్యోగాలు పొందిన వారిపై సమగ్ర విచారణ జరపాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు చేవూరు సుబ్బారావు డిమాండ్ చేశారు. నెల్లూరులోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో ఈ నెల 13న జరిగిన గిరిజన ఉద్యోగుల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో గిరిజన కులాలను తగ్గించాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వశాఖల్లో గిరిజన రోస్టర్‌ను సక్రమంగా పాటించాలని, ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టలను భర్తీచేయాలని, ఐటిడిఏ పరిధిలోని ఉద్యోగ నియామకాల్లో గిరిజనులకు ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరివీధి లక్ష్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పులి చెంచయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు టివి రమణయ్య, గౌరవాధ్యక్షుడు వై.వేణు, నాయకులు కత్తి వెంకటేశ్వర్లు, నల్లు రామయ్య, ఏకొల్లు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వేలైన్ భూసేకరణ వేగవంతం చేయాలి

## - జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు ఆదేశం



నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైను ఏర్పాటుకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన ఆయా భూములను రైల్వే అధికారులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 15న కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఆ రైల్వేలైను ఏర్పాటుకు భూసేకరణ పనులపై చర్చించారు. ఏఏ భూములు ఎంత విస్తీర్ణంలో అందుబాటులో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వభూములను ఆక్రమించుకున్న వారి వివరాలు, ఎంత భూమి ఎంతకాలంగా వారి ఆధీనంలో ఉంది, ప్రస్తుత స్థితి ఏమిటి అనే విషయాలపై నివేదిక రూపొందించి ఎక్స్‌గ్రేషియా చెల్లింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. దగదర్తి విమానాశ్రయం, రేణిగుంట-నాయుడుపేట జాతీయ రహదారి, నెల్లూరు నుంచి కృష్ణపట్నంకు ఆరులైన్ల భారతమాల రోడ్ల ఏర్పాటుకు సంబంధించి తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జేసీ వెట్రిసెల్వి, డిఆర్‌ఓ నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# జగన్మాత.. పాహిమాం!

- వైభవంగా శ్రీదేవి శరన్నవరాత్రులు
- భక్తులతో కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు





నెల్లూరు నగరంలో శ్రీదేవి శరన్నవరాత్రులు అన్ని అమ్మవారి దేవస్థానాల్లో ఈనెల 10 నుండి 18 వరకు వైభవంగా జరిగాయి.. వివిధ రూపాల్లో కొలువుతీరిన అమ్మవారిని భక్తజనం దర్శించుకుని పులకించిపోయారు. సామూహిక కుంకుమార్చనలు, నవావరణ పూజలు, సంపుటీకరణ హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. దర్గామిట్టలో వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల10న కలశస్థాపనతో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 10న చండీ అలంకారం, 11న భవాని, 12న గాయత్రి, 13 న అన్నపూర్ణ, 14న గజలక్ష్మీ, 15న సరస్వతి, 16న కాళికా, 17న దుర్గా, మహిషాసురమర్దిని, 18 న రాజరాజేశ్వరి అలంకారాలలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యేలు, అధికారులు, న్యాయమూర్తులు, నగర ప్రముఖుల పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ సహాయ కమీషనర్,కార్యనిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరాంలు పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

మూలాపేటలోని శ్రీ భువనేశ్వరీ సమేత శ్రీమ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్దానంలో, ద్రౌపతీ దేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో, సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో, పప్పుల వీధి గురుదత్తాత్రేయ మఠంలో, ఫత్తేఖాన్‌పేట అరిగెలవారి వీది మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో, కోదండరామపురం మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో, నవాబు పేట భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో, శ్రీ మహాలక్ష్మీ (బలిజ) అమ్మవారి దేవస్థానంలో, మెక్లిన్స్ రోడ్డు మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో, వేదాయపాళెం గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో, పప్పుల వీధి మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో, క్రాంతి నగర్ శివకేశవుల ఆలయంలో, నారాయణరావు పేట గుప్తాపార్కు వైష్ణవీ దేవి ఆలయంలో, సంతపేట శివాలయంలోని భ్రమరాంబ సమేత హరిహరనాథస్వామి దేవస్థానంలో, బాలాజీనగర్ సీతారామస్వామి మందిరంలో, మూలాపేట శంకరమఠంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరాల.యంలో, కొండాయపాళెం రోడ్డు రామకృష్ణ నగర్ సిద్ది వినాయక, సుబ్రహ్మణ్య, అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్దానంలో, టెక్కేమిట్ట ఎర్రకట్ట మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో, శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా అమ్మవారికి విశేష అలంకారాలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆయా ఆలయాల కార్యనిర్వహణాధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఈ ఉత్సవాలకు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



# వాత్సల్య చిన్నారులను ఆశీర్వదించిన విపిఆర్

ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి శ్రీమతి ప్రశాంతిరెడ్డి ఈ నెల 10న నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయానికి వెళ్ళి అమ్మవారిని దర్శించుకున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కోలాటం ప్రదర్శనలిస్తున్న వాత్సల్య చిన్నారుల కళాప్రదర్శనలను తిలకించి, వారిని మెచ్చుకుని దీవించారు. వారి ఆధ్యాత్మిక కళా ప్రదర్శనలు ఎంతో అద్భుతంగా ఉన్నాయంటూ ఆ చిన్నారులను వేమిరెడ్డి దంపతులు అభినందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జనహిత-వాత్సల్య కార్యదర్శి జి.వి సాంబశివరావు వాత్సల్యపై వేమిరెడ్డి దంపతులు చూపుతున్న ఆదరణ పూర్వక అభిమానానికి తన కృతజ్ఞతలు తెలియజేశారు.

## అవినీతి పాలనకు చరమగీతం పాడుదాం...

# రాజన్న రాజ్యంకు స్వాగతం పలుకుదాం!

## 'రావాలి జగన్ - కావాలి జగన్' ముగింపు సభలో శ్రీధర్‌రెడ్డి



రాష్ట్రంలో చంద్రబాబు అవినీతి పాలనకు చరమగీతం పాడి, రాజన్న రాజ్యానికి స్వాగతం పలుకుదామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్సీపి చేపట్టిన 'రావాలి జగన్-కావాలి జగన్' కార్యక్రమం ముగింపు సభ ఈ నెల 16న నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని కోడూరుపాడులో జరిగింది. ఈ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, గత 30 రోజులుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు బాగా ఆదరిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేగా ఎన్ని రకాల ఇబ్బందులున్నా వాటిని అధిగమించి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు. తన శక్తికి మంచి సమస్యల పరిష్కారం కోసం పాటుపడుతున్నారన్నారు. 'మన ఎమ్మెల్యే మన ఇంటికి' పేరుతో 105 రోజులు నియోజకవర్గంలో తిరుగుతూ ఇంటింటికి వచ్చి, ప్రజలు పెట్టిందే తిని, వారి సమక్షంలోనే గడిపారని, ప్రజల్లో ఒకరుగా కలసిపోయారని కొనియాడారు. వైఎస్సార్సీపి అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టే కార్యక్రమాలను, పథకాలను ఆయన ప్రజలకు వివరించారన్నారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో గెలవబోయే ఎమ్మెల్యేగా ప్రజలు భావిస్తున్నారన్నారు. ఆ మాటను మనందరం కలసి నిలబెట్టాలని, అత్యధిక మెజార్టీని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి అందివ్వాలని ఆయన కార్యకర్తలను, ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లేబూరు పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా

# తిప్పిరెడ్డి నారపరెడ్డి



తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వింజమూరు మాజీ జడ్పీటీసీ సభ్యుడు తిప్పిరెడ్డి నారపరెడ్డిని నియమించారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షులు ఉత్తర్వులు జారీ చేశారు. వింజమూరు మండలంలో బలమైన అనుచర వర్గం వున్న నారపరెడ్డి 2005లో వింజమూరు జడ్పీటీసీగా గెలుపొందారు. అంతకుముందు కాంగ్రెస్‌పార్టీలో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అనుచరుడిగా పలు పదవులు చేపట్టారు. ఆయన తండ్రి స్వర్గీయ తిప్పిరెడ్డి చలమారెడ్డి ఉదయగిరి మాజీ సమితి అధ్యక్షుడిగా జిల్లా రాజకీయాలలో సుపరిచితుడే! టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నారపరెడ్డిని నియమించడం పట్ల మండల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకం

## - కిలారి వెంకటస్వామినాయుడు



ప్రజాసేవలో పాత్రికేయుల పాత్ర ప్రాముఖ్యమైందని నెల్లూరు జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ కిలారి వెంకటస్వామి నాయుడు పేర్కొన్నారు. ఈ నెల 14న నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శిగా రెండవసారి ఎన్నికైన సందర్భంగా అనుముల జయప్రకాష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఉచ్చి భువనేస్వర్ ప్రసాద్ మాట్లాడుతూ జయప్రకాష్‌ను సన్మానించుకోవడం పాత్రికేయ రంగానికి గర్వకారణమన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సామ్నా అధ్యక్షులు రామ్మూర్తి మాట్లాడుతూ స్థానిక పత్రికలకు ప్రత్యేకస్థానం కల్పించేందుకు జయప్రకాష్ కృషి అభినందనీయమన్నారు. జయప్రకాష్ మాట్లాడుతూ ఏపియుడబ్ల్యూజే నిరంతరం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏపియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్, నాయకులు సంపత్ కుమార్, సామ్నా ప్రధాన కార్యదర్శి గడ్డం హనూక్, గౌరవాధ్యక్షులు రామారావు, ఉపాధ్యక్షులు సుబ్బుసింగ్, శేఖర్‌బాబు, వేలూరు సుబ్బారావు, అల్లూరు నాగేంద్రసింగ్, షేక్ రఫీ, మహేష్, దినేష్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# పార్కుల నగరంగా నెల్లూరు

## మేయర్ అబ్దుల్ అజీజ్

నెల్లూరులోని మహబూబ్‌ఖాన్ పార్కును కోటి రూపాయల వ్యయంతో ఆధునీకరిస్తామని నగర మేయర్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఈనెల 14న ఆయన 44వ డివిజన్‌లోని ఆ పార్కును సందర్శించిన అనంతరం పార్కులో మొక్కలు నాటి, నీటివసతి కల్పిస్తామని, చిన్నపిల్లలకు ఆటవస్తువులు ఏర్పాటుచేసి పార్కును నందనవనంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ అలీంబాషా, కార్పొరేటర్ సత్యనాగేశ్వరరావు, నాయకులు షంషుద్దీన్, మౌలానా, ఖుద్దూస్‌బాబు పాల్గొన్నారు.

## డీయస్‌ఓగా చిట్టిబాబు

నెల్లూరు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిగా చిట్టిబాబు ఈనెల 14న బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ ముత్యాలరాజు, జేసీ వెట్రిసెల్వీలను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ ప్రజాపంపిణీ వ్యవస్థ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటానన్నారు. అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డీయస్‌ఓను ఏయస్‌ఓలు, ఎస్డీలు అభినందించారు.

## డికెడబ్ల్యు కాలేజీ ప్రిన్సిపల్‌కు సన్మానం

నెల్లూరు డికెడబ్ల్యు కళాశాల ప్రిన్సిపల్ మస్తానయ్యను విఆర్ కళాశాల విశ్రాంత అధ్యాపకులు ఈనెల 13న ఘనంగా సత్కరించారు. మస్తానయ్యకు ఆర్‌జేడీగా పదోన్నతి రావడంపై అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా విద్యాభివృద్ధికి మస్తానయ్య చేసిన సేవలను వారు కొనియాడారు. విఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపల్ రాధిక, మల్లికార్జునరెడ్డి, గోపాల్, రవీంద్ర, వేమారెడ్డి, వరప్రసాద్‌రావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# దడపుట్టిందా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నాడు. గత ఏడెనిమిదేళ్ళలో వై.యస్. కుటుంబం లక్ష్యంగా జరిగిన ప్రతి అధికారిక దాడి కూడా రాజకీయ కోణంలో జరిగిందే! అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో జరిగిందే! అయితే జగన్ ఎప్పుడూ ఆ దాడుల గురించి బహిరంగ వ్యాఖ్యలు చేయలేదు. కుట్రపూరిత దాడులుగా చెప్పలేదు. చట్టాన్ని, న్యాయస్థానాన్ని గౌరవించి, వారి ఆదేశాలను పాటించాడు. తన మీద ఈ స్థాయిలో ఆదాయపన్ను, సిబిఐ, ఈడి దాడులు జరిగినా 'బాహుబలి'లాగా జగన్ ఎదుర్కొన్నాడు.

మరి ఈ తెలుగుదేశం నాయకులేంటి... ఒక్క ఆదాయపన్ను శాఖ దాడికే ప్యాంట్లు తడిపేసుకుంటున్నారు. మరి జగన్ మీదలాగా కేంద్రంలోని బీజేపీ వాళ్ళు పగబట్టి సిబిఐ, ఈడిల చేత దాడులు చేయిస్తే... ఈ నాలుగున్నరేళ్ళలో చేసిన అక్రమాలు, అవినీతి కుంభకోణాలపై విచారణ జరిపిస్తే... ఎంతమందికి హార్ట్‌స్ట్రోక్‌లు వస్తాయో!?

తెలుగుదేశం నాయకుల ప్రవర్తన జగన్‌కో న్యాయం, సీఎం రమేష్‌కో న్యాయం అన్నట్లుగా వుంది. తెలుగుదేశం నాయకులు చట్టాలకు అతీతులు అన్నట్లుగా మాట్లాడుతున్నారు. తెలుగుదేశం ఎంపీ సీఎం రమేష్‌పై మొన్న ఆదాయపన్ను శాఖాధికారులు మూడురోజుల పాటు దాడులు నిర్వహించారు. ఆయనకు సంబంధించిన ఇళ్ళు, సంస్థలలో సోదాలు నిర్వహించారు. కీలకమైన ఫైళ్ళు, పత్రాలు సీజ్ చేశారు. సీఎం రమేష్‌కు ముందు రాష్ట్రంలో ఒకరిద్దరు టిడిపి నాయకుల సంస్థల్లోనూ ఆదాయపన్ను శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అయితే అప్పుడు అతిగా ఆందోళన చెందని తెలుగుదేశం అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు లోకేష్‌లు సీఎం రమేష్ సంస్థలపై ఐటి దాడి అనగానే గాబరాపడ్డారు. ఇది అన్యాయం, అక్రమం అంటూ ఆక్రోశించారు. దీనిని తెలుగు జాతి మీద జరుగుతున్న దాడిగా అభివర్ణిస్తూ దీనికి రాజకీయ రంగు, ప్రాంతీయ మసి పులిమే ప్రయత్నం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌పై కక్షగట్టి ఐ.టి దాడులు చేయిస్తుందంటూ చంద్రబాబు, లోకేష్‌తో పాటు రాష్ట్ర మంత్రులు కూడా పాటందుకున్నారు.

ఈ దేశంలో ఎందరి మీదో ఐ.టి దాడులు జరిగాయి. తనిఖీలలో తమ నిజాయితీని నిరూపించుకున్నవాళ్ళున్నారు. ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొట్టి గుట్టలు గుట్టలుగా బ్లాక్‌మనీ పోగేసినవాళ్ళున్నారు. సీఎం రమేష్ దీంట్లో ఏ కోవకు చెందుతాడన్నది తర్వాత తేలుతుంది. ఆయన సంపాదించిందంతా సక్రమమే అయితే, ఆయన సంపాదించిన సొమ్ముకు లెక్కలు పక్కాగా వుంటే ఆయనగాని, తెలుగుదేశం నాయకులు గాని ఆందోళన చెందాల్సిన పనేలేదు. ఇంకా ఇన్‌కంటాక్స్ వాళ్ళు ఇచ్చే క్లీన్ సర్టిఫికేట్‌ను పట్టుకుని మేము నిప్పులాంటి చంద్రబాబు అనుచరులం అని ప్రచారం చేసుకోవచ్చు. ఏ తప్పు చేయకుంటే ఇంతలా భయపడాల్సిన పనిలేదు. దీనిని ఓ యుద్ధంలా చిత్రీకరించాల్సిన అవసరం లేదు.

2014కు ముందు సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ సంస్థలు అప్పుల్లో వున్నాయని సమాచారం. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగున్నరేళ్ళలోనే సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ కంపెనీలు వేల కోట్ల కాంట్రాక్ట్ పనులను దక్కించుకున్నాయి. వేలకోట్ల ఆస్తులు పెరిగాయి. సీఎం రమేష్ విలాసవంతమైన భవనాలు కట్టాడు. కడప స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వంద కోట్లకు పైగానే ఖర్చుపెట్టాడు. ఒకప్పుడు సాధారణ సారా వ్యాపారి అయిన సీఎం రమేష్ ఆస్తులు ఈరోజు వేలకోట్లకు పెరగడం వెనుక మతలబు ఏమిటి? ఇవన్నీ కూడా కేంద్ర సంస్థలు నిఖార్సుగా దర్యాప్తు జరిపితే ఒక్కొక్క నిజం వెలుగులోకి వస్తుంది.

ఒక్క సీఎం రమేష్ కంపెనీలపై దాడి జరిగితేనే చంద్రబాబు బృందానికి ఇంతగా దడ పుడుతుంది. తెలుగుదేశంలో ఇలాంటి రమేష్‌లు ఇంకా చాలామందే వున్నారు. అందరి మీద ఎన్నికలలోపే ఐటి, సిబిఐ, ఈడి, సిబిఐసిలు పడితే చంద్రబాబు పరిస్థితి ఎలా వుంటుందో?

## నెల్లూరీయునికి 'కళాభారతి' పురస్కారం



పురస్కారాన్నందుకుంటున్న మురళీమోహన్‌రాజు

నెల్లూరు రూరల్ మండలం బుజబుజనెల్లూరుకు చెందిన పినాకిని యూత్‌వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్ రాజుకి చిత్తూరుజిల్లాలోని కళాభారతి సంస్థ పురస్కారం లభించింది. ఈనెల 14న ఆ జిల్లాలోని పి.కోట జ్యూట్‌పార్క్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో తెలుగుభాషాభివృద్ధికి ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డును బహుకరించి ఘనంగా సన్మానించారు. ద్రవిడ యూనివర్శిటీ ఉపకులపతి సత్యనారాయణ, సినీ నటుడు కోట శంకరరావుల చేతుల మీదుగా ఆయన ఈ విశిష్ట పురస్కారాన్ని అందుకున్నారు.

# అ(భ్ర)మరావతి!

(మొదటి పేజీ తరువాయి)

ఇంతవరకు సక్రమంగా ఇవ్వలేదు. అమరావతిలో ఇచ్చే స్థలాలకు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో వుండే ధరను లెక్కేసి చెప్పి రైతులను ఆకాశంలోకి తీసుకెళ్ళారు. అరచేతిలో వైకుంఠం చూపించారు. రాజధాని పేరు చెప్పి చంద్రబాబు, ఆయన బృందం స్పెషల్ ఫ్లైట్లు వేసుకుని పది, పదిహేను దేశాల దాకా తిరిగారు. సింగపూర్ నుండి మొదలుపెట్టి ఏ దేశాలలో పర్యటిస్తే ఆ దేశ రాజధాని నగరంలా అమరావతిని నిర్మిస్తామంటూ ఊదరగొట్టారు. మన ఇంజనీర్లు అయితే మురికివాడలు కడుతారంటూ అమరావతి రాజధాని డిజైన్‌లను గీసే పనిని సింగపూర్, బ్రిటన్ కంపెనీలకు అప్పగించారు. రియల్ ఎస్టేట్ బ్రోచర్‌లు మాదిరిగా ఆ కంపెనీలు అమరావతి డిజైన్‌లు గీసిచ్చాయి. వాటిని పచ్చపత్రికలు ఫ్రంట్ పేజీలో ప్రచురించి అహో అమరావతి అద్భుతమంటూ కీర్తించాయి. ఇంద్రుడు కూడా తన అమరావతిని కూలగొట్టి చంద్రబాబు అమరావతిలాగా కట్టుకోవాలనుకుంటున్నాడన్నట్లు కుల మీడియా కథలల్లింది. చివరికి విదేశీ కంపెనీలు ఇచ్చిన డిజైన్లు కూడా బాబుకు నచ్చక గ్రాఫిక్ సినిమాల డైరెక్టర్ రాజమౌళిని రంగంలోకి దించారు. సినిమా సెట్టింగ్‌లు వేసుకునే వాళ్ళతో రాజధాని నిర్మాణం గురించి సలహాలు అడిగారంటేనే అమరావతి నిర్మాణ పరిస్థితి ఏంటో అర్ధమవుతుంది. ఇంతవరకు అసెంబ్లీ, హైకోర్టు భవనాల డిజైన్‌లనే ఫైనల్ చేయలేదు. ఈ నాలుగున్నరేళ్ళలో అక్కడ వెలిసింది వానొస్తే ఉరిసే తాత్కాలిక అసెంబ్లీ, సచివాలయాలే! ఈమాత్రం దానికి ఇప్పటికే వేలకోట్లు తగలేసారు. ఇక చంద్రబాబు ఊహించి కలలుగంటున్న రాజధానిని కట్టాలంటే ఇంకెన్ని లక్షల కోట్లు తగలెయ్యాలో!?

చంద్రబాబు శాశ్వతంగా అధికారంలో వుండడు. చంద్రబాబు ఆర్భాటాలను ఇంకొకరు అమలు చేస్తారన్న నమ్మకం లేదు. ఈ ఐదేళ్లలో అమరావతిలో పొడిచిందేమీ లేదు. 33వేల ఎకరాలలో పంటల ఉత్పత్తిని దెబ్బతీయడం తప్ప! ఇంకో ఐదేళ్ళు అధికారమిచ్చినా అక్కడ ఒరిగేదేమీ వుండదు. ఎందుకంటే మన రాష్ట్ర బడ్జెట్ చంద్రబాబు కలల రాజధానిని భరించే స్థాయిలో లేదు. అమెరికా, రష్యా, చైనా దేశాల బడ్జెట్ అయితే ఆయన రాజధానికి సరిపోతుందేమో?!

ఈ ప్రపంచంలో ఏ ఆధునిక నగరం కూడా ఎవరూ నిర్మించింది కాదు. గ్రామ స్థాయి నుండి మొదలై నగరాల స్థాయికి చేరుకున్నవే! హైదరాబాద్ నగరం ఈరోజు ఈ స్థాయిలో వుందంటే దాని వెనుక ఐదు వందల ఏళ్ళ చరిత్ర వుంది. ఒక చెన్నై... ఒక కలకత్తా... ఒక బెంగుళూరు... ఏ నగరమైనా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల సహకారంతో అభివృద్ధి చెందినవే! మలేషియా వాళ్ళు 5వేల ఎకరాలలో 'పుత్రజయ' నగరాన్ని నిర్మించడానికి 20ఏళ్ళు పట్టింది. ఛత్తీస్‌ఘడ్ రాజధాని నయారాయపూర్‌ను 15ఏళ్ళ నుండి కడుతూనే వున్నారు. మరి నిధులు లేకుండా 33వేల ఎకరాలలో రాజధానిని నిర్మించాలంటే మాటలా... అసలు రాష్ట్ర ప్రజలకు అంత అవసరముందా? ఈ ఐదేళ్లలో ఐదుశాతం పని కూడా జరగలేదు. వచ్చే ప్రభుత్వం ఎవరిదో తెలియదు. 33వేల ఎకరాల మాగాణిని బీడుపెట్టి, భూస్వాములను భూమిలేని స్వాములుగా మార్చి లోకేష్ చెప్పినట్లు సంపద నుండి చెత్తను సృష్టించడం అంటే ఇదేనేమో!?

# మిగిలేది శూన్యమే!

అజాతశత్రువుకి
అంతులేని కోపం వచ్చింది
కండువా ధరించిన ఫాలనేత్రధారి
కన్నుతెరిచే రోజొచ్చింది
కూడుపెట్టే జగన్నాయకుడు
జ్వలితజ్వాలై రగిలిపోతున్నాడు
ధరలు భూమార్గం పట్టి
పంటలకు చుక్కలు చూపిస్తే
దైన్యాన్ని విస్తళ్లలో వడ్డించుకుతింటున్నాడు
వివాదాల హోరులో
రంగురంగుల వాగ్దానాల రంగేళిలో
పార్టీలకు కల్మషం తలకెక్కి
కల్లాల్లో కల్లోలాలు సృష్టిస్తే
దింపుడుకల్లాం ఆశ కూడా కానరాక
అతగాడి కంట కన్నీటిసంద్రం
దగాపడ్డ నిశ్శబ్ధం
పగిలిన శబ్దగోళమైంది
ఒక్కసారిగా వైప్లవ్యగీతిక ఆలపించింది
నిన్న ఢిల్లీలో
మొన్న ముంబైలో
బ్రతుకునిచ్చిన మనిషిని
కష్టాల పాల్జేస్తే
మాతృస్పర్శతో అన్నం పెట్టిన వ్యక్తిని
అనాధను చేస్తే
అతగాడు రోడ్డెక్కాడు
మనకోసం అహారసాధాలు నిర్మించిన
ధరణీపుత్రుడు
చిందించిన స్వేదం సేద్యమై
కాటేస్తే...
వసంతం సృష్టించిన జీవితం
శిశిరం నరకప్రాయమైతే
రాబోయే రోజుల్లో పట్టెడన్నం కోసం
పోరాటాలు చేయాల్సివస్తుంది
వస్తు విపణి స్వర్గాన్ని తలచుకుని
త్రేన్చాల్సివస్తుంది
అమృతధారలందించే వ్యక్తిని
మృతప్రాయమైన మార్కెట్
బహుకరిస్తే
ఆకలియుద్ధం ఆరంభమయ్యే రోజు
అతి దగ్గరలో ఉంది
తలపాగా ధరించిన జీసస్‌లాంటి
అతగాడు..
అలిగితే ప్రకృతి ప్రకోపించినట్లే
ఇక బ్రతుకు బండెడు భారమే
మనకు మిగిలేది శూన్యమే!...

- చిన్ని నారాయణరావు

# పింకీ.. ఇక లేదు



ఎన్నో మిస్టరీ కేసులను చేధించడంలో కీలకంగా పనిచేసిన పింకి(స్నిఫర్ డాగ్) ఈనెల 14న మృతి చెందింది. పింకి జాగిలం 2006జనవరి 23వ తేదీన జన్మించింది. అప్పటి నుంచి జిల్లా పోలీస్‌శాఖ డాగ్ స్క్వాడ్ విభాగంలో పని చేస్తోంది. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిపై బాంబ్ బ్లాస్టింగ్ కేసులో కీలక ఆధారాలు చూపించడంలో పింకి ముఖ్య పాత్ర పోషించింది. రాపూరు మైన్స్‌లో బ్లాస్టింగ్ జరిగిన సమయంలో 32 జిలెటిన్ స్టిక్స్‌ను గుర్తించింది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన రీఫ్రెష్ కోర్సుల్లో ప్రథమ బహుమతులను రెండుసార్లు గెలుచుకుని జిల్లాకు పేరు తెచ్చింది. పింకికి ఎస్పీలు పి.పరమేశ్వరరెడ్డి, వీరభద్రుడు, ఆర్‌ఐలు మౌలాలుద్దీన్, రమేష్ కృష్ణ, హ్యాండ్లర్ యస్‌కే మస్తాన్ నివాళులర్పించారు. అనంతరం పింకి మృత దేహాన్ని శ్మశానవాటికలో ఖననం చేసారు.

# మితిమీరుతున్న ధోరణి... మాట తూలుతున్న కాకాణి



***రాజకీయాలకో భాష ఉంది... ఒక భావం వుంటుంది. వాడే పదాలకో పద్ధతి వుంటుంది. చేసే విమర్శలకో హద్దు వుంటుంది. కాలు జారితే తీసుకోవచ్చేమో గాని, నోరు జారితే తీసుకోలేం. ముఖ్యంగా ప్రజా జీవితంలో వుండే రాజకీయ నాయకుల భాషను, వాడే పదాలను పదిమంది వింటుంటారు. వారు మాట్లాడే భాష, చేసే విమర్శలు పదిమందిని ఆకట్టుకునేటట్టుండాలే గాని, ఆ పదిమంది అసహ్యించుకునేటట్లుండకూడదు. మనం వాడే భాష, మాట్లాడే మాట మన గౌరవం పెంచాలి, మనలోని సంస్కారాన్ని చాటాలి!***

ఈ జిల్లా ఎంతోమంది జాతీయ స్థాయి ఉద్ధండ రాజకీయ పిండాలను అందించింది. బెజవాడ గోపాలరెడ్డి, యం.వెంకయ్యానాయుడు, పుచ్చలపల్లి సుందరయ్య, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏ.సి.సుబ్బారెడ్డి... ఇలా ఎందరో నాయకులు ఈ జిల్లాలో మన కళ్ళ ముందు రాజకీయాలు చేసారు. వీరంతా ఒకే పార్టీలో వున్నోళ్ళు కాదు... వేర్వేరు పార్టీలలో ప్రత్యర్థులుగా వున్నోళ్ళే! రాజకీయ శత్రుత్వం కూడా తక్కువ వుండేది కాదు. ఒకర్నొకరు ఓడించుకోడానికి తీవ్రంగా శ్రమించే వాళ్ళు. వాళ్ళు ఒకర్నొకరు విమర్శలు చేసుకున్నారంటే... ఆ విమర్శలు కేవలం రాజకీయ, పరిపాలనా పరమైన అంశాలకే పరిమితమై వుండేవి. వారి విమర్శల్లో, ఆరోపణల్లో సంస్కారం వుట్టిపడేది. వ్యక్తిగత విమర్శలకు, వ్యక్తిగత వైషమ్యాలకు తావిచ్చేవాళ్ళు కాదు.

అలాంటి సంస్కారవంతమైన నాయకులకు పుట్టినిల్లు నెల్లూరుజిల్లా. అలాంటి జిల్లాలో ఈరోజు కొందరు నాయకులు చేస్తున్న వ్యక్తిగత విమర్శలు చాలా రోత కలిగిస్తున్నాయి.

నెల్లూరుజిల్లాలో ఏ నియోజకవర్గంలోనూ లేనంతగా సర్వేపల్లి నియోజకవర్గం కేంద్రంగా వ్యక్తిగత విమర్శల దాడి ఎక్కువుగా వుంటోంది. ముఖ్యంగా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యక్షంగా సభలలోనూ, సోషల్ మీడియాలోనూ వాడుతున్న భాష తీవ్ర అభ్యంతరకరంగా వుంటోంది.

సర్వేపల్లి నియోజకవర్గం రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరు. గత మూడు దశాబ్దాల రాజకీయ చరిత్రను పరిశీలిస్తే దాదాపు పదేళ్ళ పాటూ సోమిరెడ్డి, సి.వి.శేషారెడ్డిల మధ్య విమర్శల దాడి నడిచింది. అయితే వాళ్ళ మధ్య విమర్శలెప్పుడూ హద్దులు దాటలేదు. వారి విమర్శలు, ఆరోపణలన్నీ కూడా అభివృద్ధి, అవినీతి అనే అంశాల చుట్టే తిరిగేవి. వ్యక్తిగతంగా ఒకర్నొకరు కించపరచుకున్న సందర్భాలు లేవు. ఆ తర్వాత పదేళ్ళ పాటు సోమిరెడ్డి వర్సెస్ ఆదాల అన్నట్లుగా ఇరువురి మధ్య విమర్శల యుద్ధం తీవ్రస్థాయిలో జరిగింది. విమర్శలలో వేడి వాడిని పెంచారే గాని వ్యక్తిగత విమర్శల జోలికి పోలేదు. వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయలేదు.

కాని, సోమిరెడ్డిపై కాకాణి చేస్తున్న విమర్శలు, ఆయన వాడుతున్న భాష వారికి భిన్నంగా వుంది. ఆయన భాష హద్దులు దాటుతోంది. సోమిరెడ్డిని ఉద్దేశించి ఆయన పెడుతున్న మారుపేర్లు కూడా ఆయన హోదాకు తగ్గట్లు లేవు. ఆయన వాడుతున్న పదాలు, తిట్లు అసలు పత్రికలలో వ్రాసేటట్లుగా కూడా లేవు.

నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందంటారు. మన నోరు అదుపులో వుంటే జనం మన ముంగిట్లో వుంటారు. నంద్యాల ఉపఎన్నికల్లో చంద్రబాబుపై జగన్ అనవసరంగా ఒక మాట తూలినందుకు దాని నష్టం చాలా జరిగింది. నాలుకకు రెండువైపులా పదును వుంటుంది. సంస్కారవంతంగా ఆ నాలుక పనిచేస్తే సమాజంలో మన గౌరవం పెరుగుతుంది. అదే నాలుక క్రమశిక్షణ తప్పితే మన పరువే మంటకలుస్తుంది. నాయకులు దీనిని గమనించుకుంటే మంచిది.



## సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న...

# చంద్రబాబు డూప్

**రాముడు – భీముడు, అపూర్వ సహోదరులు, హలోబ్రదర్, జీన్స్, అదుర్స్ వంటి తెలుగు సినిమాలలో ఇద్దరు వ్యక్తులు ఒకేలా వుండే సన్నివేశాలు చూసాం. అయితే ఆ సినిమాలో ముందు ట్విన్స్‌గా కనిపించే హీరోలిద్దరినీ వేర్వేరుగా పరిచయం చేసినా, సినిమా క్లైమాక్స్‌కొచ్చేసరికి వారికి రక్తసంబంధం కలిసిపోతుంది. సినిమాలు కాబట్టి పాత్రలను మన ఇష్టం వచ్చినట్లు క్రియేట్ చేసుకోవచ్చు. ఆ పాత్రల సంబంధాలను ఎక్కడో చోట ముడిపెట్టవచ్చు. కాని, నిజ జీవితంలో కూడా మనిషిని పోలిన మనిషి తారసపడితే... వారి మధ్య ఎలాంటి రక్తసంబంధాలు లేకపోతే ఆశ్చర్యం వేయక మానదు.**

భూమ్మీద మనిషిని పోలిన మనుషులు ఏడుమంది దాకా వుంటారంటారు. ఒకే రూపంలో ఏడుమందిని చూడడం అసాధ్యంగాని, కాని మనిషిని పోలిన మనిషిని అప్పుడప్పుడు చూస్తుంటాం. డొనాల్డ్ ట్రంప్, పుతిన్, నరేంద్ర మోడీ వంటి నాయకులను పోలిన వ్యక్తులు వున్నట్లు సోషల్ మీడియాలో చూసాం. అయితే ఈ ప్రపంచంలో ఎవరిని పోలిన మనిషైనా వుండొచ్చేమోగాని చంద్రబాబును పోలిన మనిషి వుండడం చాలా కష్టం. ఎందుకంటే ఆయన ఎత్తు, ఒత్తయిన జుట్టు, తెల్లగడ్డం... ఆయన ఫేస్ చాలా డిఫరెంట్‌గా వుంటుంది. అలాంటి డిఫెరంట్ చంద్రబాబును పోలిన మనిషిని కూడా పట్టేసారు కొందరు. గత కొన్నిరోజులుగా ఓ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఓ టిఫిన్ సెంటర్‌లో అచ్చం చంద్రబాబులాగే వున్న ఓ వ్యక్తి కేవలం నిక్కరు, బనియన్ మాత్రమే వేసుకుని చట్నీ వడ్డిస్తున్న దృశ్యం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇలాంటి వీడియోలు ఈనాటి కుర్రోళ్ళ చేతుల్లో పడితే దానికి ఇంకెంత క్రియేటివిటి జోడిస్తారో వేరే చెప్పాలా? పలు సినిమాలలోని 'డబుల్ ఫోటో' కామెడీ సన్నివేశాలను ఈ వీడియోకు జత చేసి చంద్రబాబును ఆడుకుంటున్నారు. ఇక వ్యక్తిగత జీవితంలో వివాదాలను వెల్‌కం బోర్డు పెట్టి ఆహ్వానించే సినీ దర్శకుడు రామ్‌గోపాలవర్మ చంద్రబాబును అచ్చు గుద్దినట్లు వున్న ఆ వ్యక్తి ఆచూకీ తెలిపితే లక్ష రూపాయలు బహుమతిగా ఇస్తానని ప్రకటించాడు. తాను తీయబోయే ఎన్టీఆర్ బయోపిక్‌లో చంద్రబాబు పాత్రలో ఆ వ్యక్తిని పెట్టుకుంటానంటున్నాడు.

మొత్తానికి ఈ చంద్రబాబు డూప్ ఎవరో గాని సోషల్ మీడియాలో పెద్ద సబ్జెక్ట్ అయ్యాడు. ఆయన ఏదన్నా ప్రొఫెషన్‌లో వుండుంటే అది వేరే సంగతి, కాకా హోటల్‌లో సర్వర్‌గా వుండే సరికి కామెడీ స్టోరీలు తయారవుతున్నాయి.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com